# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శుక్రవారం 20 జూన్ 2025 | సంపుటి:9 | సంచిక:174 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


15 రోజుల్లోనే ఓటర్ కార్డు


## ఇంటికొస్తుంది


2

## కిలో వెండి రూ. 1.21 లక్షలు




జీవనకాల గరిష్ఠ స్థాయికి సిల్వర్ రేట్ 2



# బ్రిటన్ మాజీ ప్రధానితో లోకేష్ భేటీ

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఏపీ విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా బ్రిటన్ మాజీ ప్రధాని, టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) వ్యవస్థాపకులు టోనీ బ్లెయిర్‌తో మంత్రి సమావేశమయ్యారు. ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యలో ఏఐ టూల్స్ వినియోగంపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న నైపుణ్యాభివద్ధి ఎజెండా, స్కిల్ సెన్సస్, దేశం వెలుపల యువతకు ఉపాధి వంటి అంశాల్లో టీబీఐ సాంకేతిక మద్దతుపై ఈ సమావేశంలో చర్చించారు. నైపుణ్య శిక్షణ అంశాలు, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారంపై ఒప్పందం కుదిరింది. అలాగే ఉన్నత విద్యలో సంస్కరణలు, సాంకేతిక మద్దతుపై సమీక్ష నిర్వహించారు.

న్యూఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో టోనీ బ్లెయిర్‌ను మంత్రి లోకేష్ కలుసుకుని పలు అంశాలపై చర్చించారు. గత ఏడాది జులై నెలలో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌ను మంత్రి లోకేష్ ముంబైలో కలిశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యకలాపాలు, విద్యావ్యవస్థలో ఏఐ టూల్స్‌ను ఉపయోగించడానికి టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్(టీబీఐ) ద్వారా సహకరించేందుకు టోనీ బ్లెయిర్ అంగీకరించారు. ఆ మేరకు విద్యారంగంలో అధునాతన సాంకేతికతను అమలు చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడానికి ఏపీ విద్యాశాఖ, టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ) మధ్య 2024 డిసెంబర్‌లో ఒప్పందం కుదిరింది.

ఈ ఒప్పందంలో భాగంగా టీబీఐ విజయవాడలో తమ ఎంబెడెడ్ బందాన్ని మొహరించి రెండు ప్రధాన అంశాలపై దష్టి సారించి అభివద్ధి చేస్తోంది. అందులో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యలో సంస్కరణలు, గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ స్థాపన ప్రధానమైనవి. ఏపీ విద్యా శాఖ, ...మిగతా 2లో

## మా ప్రభుత్వంలో ఎవరిపైనా కక్షసాధింపులు ఉండవు

జగన్ పాలనలో తప్పు చేసిన వారంతా శిక్ష అనుభవిస్తారని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. తప్పు చేసిన వారిని ఎవరిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న కేసుల విచారణ కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు అధికారం తమకు ఇచ్చింది జగన్, ప్రతిపక్ష నేతలపైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడటానికి కాదని స్పష్టం చేశారు. చట్టప్రకారం అందరికీ శిక్షపడేలా చేస్తామని హెచ్చరించారు. తమ ప్రభుత్వంలో ...మిగతా 2లో

## బనకచర్లపై సీఎం చంద్రబాబు

# కీలక వ్యాఖ్యలు..



అమరావతి: బనకచర్ల ప్రాజెక్టుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కీలక కామెంట్స్ చేశారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన సీఎం.. ఈ ప్రాజెక్ట్‌పై క్లారిటీ ఇచ్చారు. ఇదే సమయంలో బనకచర్లపై తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపై స్పందించారు. బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో తాను చాలాసార్లు చెప్పానని అన్నారు. పోలవరం మినహా ఇంకా అక్కడ ఏ ప్రాజెక్ట్‌కి అనుమతి లేదని సీఎం స్పష్టం చేశారు.

గోదావరి నుంచి నీళ్లను వేరే బేసిన్‌కు తీసుకువెళ్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. గోదావరి నీళ్లతో కాళేశ్వరం కట్టినప్పుడు తాను అభ్యంతరం వ్యక్తం చేయలేదని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాల్లో తెలుగు వాళ్లు ఉన్నారని.. తాను తెలంగాణ వాళ్లతో ఎప్పుడూ గొడవ పడలేదన్నారు. గొడవ పడటం అనేది ప్రజలను మభ్యపెట్టడమే అవుతుందన్నారు. తాను హైదరాబాద్‌ను ఏపీ కోసం అభివద్ధి చేశానని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తాను హైదరాబాద్ కావాలని ఎలా అడుగుతానని ప్రశ్నించారు సీఎం చంద్రబాబు.

'మీరు కట్టే ప్రాజెక్ట్‌లు అన్ని కట్టండి.. పోరాటాలు తర్వాత చేయొచ్చు. మేం హామీ ఇచ్చింది డబుల్ ఇంజన్ సర్కార్. అంటే దాని అర్థం ఏమిటో తెలుసుకోండి. అందరు కలిసి రాష్ట్రాలను పోటీ పడి అభివద్ధి చేయాలనేది నా కోరిక. తెలుగు జాతిని నంబర్ వన్‌గా చేయడం అందరి బాధ్యత.. అందుకోసం అందరం పని చేద్దాం. నేను ఎవరితో గొడవ పెట్టుకోను.. కానీ రాష్ట్రం హితం కోసం పోరాడుతా. బనకచర్ల వల్ల ఎవరికీ నష్టం లేదు. వరద జలాలను మాత్రమే వాడతామని చెప్పాం.' అని సీఎం చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు.

మనం మనం ఒకటి..

## ఎవరి శక్తి మేరకు వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుందాం

'బనకచర్ల'పై ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, జూన్ 19: సముద్రంలో కలిసే నీటి వాడకంపై సమస్య సృష్టించడం ఎంత వరకు సమంజస మని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి నీళ్లను ఇరు రాష్ట్రాలు వాడుకుంటున్నాయని, ...మిగతా 2లో

## ఏపీలో 1.30లక్షల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు

అమరావతి: యోగా మన జీవితంలో భాగం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. యోగాంధ్రపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రమంతా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 9వ తరగతి నుంచి విద్యార్థులు యోగా చేయాలన్నారు. భవిష్యత్తులో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణ, కోర్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు. ''గత నెల 21 నుంచి ఈనెల 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. యోగాంధ్ర కోసం 2 కోట్ల మందిని టార్గెట్ పెట్టుకుంటే లక్ష్యానికి మించి 2.39 కోట్లమంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2,600 మంది మాస్టర్ ట్రైనర్లను నియమించాలనుకుంటే ...మిగతా 2లో

## రప్పా రప్పా.. అని ఎవరిని నరుకుతారు? ప్రజలనా?

### మంత్రి పయ్యావుల



అమరావతి: ఓటమి నుంచి వైకాపా నేతలు ఇంకా పాఠం నేర్చుకోలేదని, ఎందుకు ఓడిపోయామనే పరిశీలన కూడా చేసుకోలేదని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. వైఎస్ జగన్ పల్నాడు పర్యటన అంశంపై మంత్రి మీడియాతో మాట్లాడారు. ''నక్సలైట్లను చూసి కలబడి నిలబడిన నాయకుడు చంద్రబాబు. రౌడీలను సమీకరించి రాష్ట్రాన్ని భయపెట్టాలనుకుంటున్నారా.. జగన్? పోలీసు వ్యవస్థను ఉపయోగించి గతంలో అరాచకం చేశారు. అందుకే గతంలో జరిగిన అరాచకాలను ప్రజలు రప్పా రప్పా నరికారు.

ప్రభుత్వంపై కాదు.. ప్రజలపైనే వైకాపా తిరుగుబాటు. రప్పా రప్పా అని ఎవరిని నరుకుతారు? ప్రజలనా? ఏడాది కిందట చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఇప్పుడు పరామర్శనా? పరామర్శ పర్యటనలో ఇద్దరు చనిపోతే పరామర్శించలేదే. సొంత బాబాయి కుటుంబాన్ని జగన్ ఎందుకు పరామర్శించలేదు'' అని పయ్యావుల ప్రశ్నించారు.

## జగన్ పల్నాడు పర్యటనపై షర్మిల కామెంట్స్



విజయనగరం: పల్నాడులో బెట్టింగ్‌లో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబాన్ని మాజీ సీఎం జగన్ పరామర్శించడంపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి స్పందించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బెట్టింగ్‌లో ఆత్మహత్య చేసుకున్న వాళ్ళకు జగన్ పరామర్శ చేయడం ఏంటి అని ప్రశ్నించారు. వారికి విగ్రహాలు కట్టడం ఏంటని.. సమాజం ఎటు పోతుందని అన్నారు. జగన్ ప్రజా సమస్యల మీద పోరాటం చేయాలని.. బల ప్రదర్శనలు కాదు అంటూ హితవుపలికారు. జగన్ బీజేపీకి దత్తపుత్రుడు కాబట్టి..అన్ని అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. దగ్గరుండి బలప్రదర్శనలు ...మిగతా 2లో



## విద్వేషాలు రెచ్చగొట్టాలనే జగన్ కుట్రలు చెల్లవు: దేవినేని ఉమ

అమరావతి: పరామర్శల పేరుతో సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టాలన్న జగన్ కుట్రలు చెల్లవని తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పల్నాడు జిల్లా పర్యటనలో వైకాపా కార్యకర్తలు చేసిన వీరంగం, విన్యాసాలు వారి ఉన్మాద మనస్తత్వానికి పరాకాష్ఠ అని దుయ్యబట్టారు.


''ఐదేళ్ల వైకాపా అరాచకాలకు 11 సీట్లతో ప్రజలు ప్రతిపక్ష దా లేకుండా చేసినా వైకాపా వైఖరిలో మార్పు రాలేదు. జగన్ సహా ఆ పార్టీ నేతలు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యాన్ని పరిహసించేలా ఉంది. అలజడులు సష్టించి రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది''అని దేవినేని అన్నారు.

## మా తప్పేం లేదు

ఆ విమానం 'ఫిట్'గానే ఉంది

బయల్దేరడానికి ముందూ చెక్ చేసినం

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిరిండియా ఎండీ


2

## మందలించాల్సింది పోయి.. వెనకేసుకొచ్చిన జగన్



అమరావతి: 'అంతు చూస్తాం.. రప్పా రప్పా నరుకుతాం' అంటూ పల్నాడులో భీతావహ వాతావరణానికి కారణమైన తమ పార్టీ కార్యకర్తల్ని మందలించాల్సింది పోయి వారిని వెనకేసుకొచ్చారు వైకాపా అధినేత వైఎస్ జగన్. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ప్లకార్డులు ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి.. పైగా దానికో కొత్త భాష్యం చెప్పే ప్రయత్నం చేశారు. 'పుష్ప' సినిమాలో డైలాగ్ కొట్టడం కూడా తప్పేనా? అంటూ మీడియా సమావేశంలో సమర్థించుకొచ్చారు. ''గంగమ్మతల్లి జాతరలో పొట్టేళ్ల తలలు నరికినట్టు నరికేస్తాం' అని ...మిగతా 2లో

# నోట్లున్నది నిజమే

జస్టిస్ వర్మ ఇంట్లో బయటపడ్డ డబ్బు ఆయనదే! 2

జడ్జిగారింట్లో నోట్ల కట్టల వివాదం..పై న్యాయమూర్తుల ప్యానెల్ నివేదిక

విధుల నుంచి తొలగించొచ్చని సిఫారసు?

# బాంబుల మోతలు మా చెవుల్లో ఇంకా మారుమోగుతూనే ఉన్నయ్

తమ భయానక అనుభవాలను గుర్తు చేసుకున్న విద్యార్థులు

ఇరాన్ నుంచి ఆపరేషన్ సింధు ద్వారా ఢిల్లీ చేరిన మెడికల్ స్టూడెంట్స్



ఢిల్లీ, జూన్ 19: 'ఆ రాత్రంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని క్షణమొక యుగంగా గడిపాం. బాంబుల మోతలు.. క్షిపణుల దాడులు.. అదొక కాళరాత్రి. ఎటు పోవాలో.. ఏం చేయాలో..దిక్కుతోచక తల్లడిల్లిపోయాం.. ' అని ఇరాన్‌లోని భారతీయ వైద్య విద్యార్థులు వారు ఎదుర్కొన్న భయానక పరిస్థితిని వివరించారు. ఇరాన్ లోచిక్కుకు పోయిన భారతీయులను వెనక్కి రప్పించేందుకు కేంద్రం 'ఆపరేషన్ సింధు' ప్రారంభించి.. తొలిసారిగా ఊర్మియా యూనివర్సిటీకి చెందిన 90 మంది మెడికల్ విద్యార్థులతో సహా 110 మంది ఢిల్లీ చేరుకున్నారు. మీర్ ఖలీఫ్ అనే ఎంబీబీఎస్ విద్యార్థి మాట్లాడుతూ.. 'అక్కడ భయానక వాతావరణం ఉంది. ఇంకా చాలా మంది భారతీయ విద్యార్థులు అక్కడ చిక్కుకున్నారు. వారంతా తొందర్లోనే స్వదేశానికి రావాలి. ఇరాన్లో ఉన్నవారిని రప్పించేందుకు భారత ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఇండియన్ ఎంబసీ మమ్మల్ని సంప్రదించిన తర్వాతే ...మిగతా 2లో

## మా దేశం నుంచే ఖలిస్థానీల కుట్రలు

కెనడా సంచలన నివేదిక


6

## ఇరాన్ నోట 'హర్మూజ్' మూసివేత ప్రస్తావన




టెహరాన్, జూన్ 19: ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. హర్మూజ్ జలసంధిని కూడా మూసివేసే ఆప్షన్ తమ వద్ద ఉందని వెల్లడించింది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ జలసంధిని మూసివేయడం కూడా ఓ మార్గమని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిటీ సభ్యుడు బెహ్నాం సయీదీ గురువారం మీడియాకు తెలిపారు. పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఒత్తిడి చేసిన సమయంలో గతంలోనూ హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ బెదిరించింది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. ప్రపంచ చమురు మార్కెట్‌కు హర్మూజ్ జలసంధి జీవనాడి. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం-ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం ...మిగతా 2లో

# బ్రిటన్ మాజీ ప్రధానితో లోకేష్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

టీబీఐ మధ్య ఒప్పందం తర్వాత ఏ మేరకు పురోగతి సాధించారనే అంశంపై ఇద్దరు నేతలు సుదీర్ఘంగా సమీక్షించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న నైపుణ్యాభివద్ధి ఎజెండా, స్కిల్ సెన్సస్, దేశం వెలుపల యువతకు ఉపాధి వంటి అంశాల్లో టీబీఐ సాంకేతిక మద్దతుపై ఈ సమావేశంలో చర్చించారు. గ్లోబల్ ఇనిస్టిట్యూట్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సలహాబోర్డులో చేరాల్సిందిగా టోనీ బ్లెయిర్‌ను మంత్రి లోకేష్ ఈ సందర్భంగా ఆహ్వానించారు.నైపుణ్య శిక్షణ అంశాలు, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ స్థాపనకు సహకారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, టోనీ బ్లెయిర్ ఇన్స్టిట్యూట్ మధ్య ఒప్పందం కుదిరింది. ఆగస్టులో విశాఖపట్నంలో జరగబోయే రాష్ట్రాల విద్యా మంత్రుల కాంక్లేవ్‌కు టీబీఐ భాగస్వామిగా ఉంటుందని టోనీ బ్లెయిర్ అన్నారు. ఈ సమావేశంలో విద్య శాఖ కార్యదర్శి కోన శశిధర్, టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మా ప్రభుత్వంలో ఎవరిపైనా కక్షసాధింపులు ఉండవు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరిపైనా కక్షసాధింపులు ఉండవని స్పష్టం చేశారు.ఢిల్లీలో మీడియాతో నారా లోకేష్ చిట్‌చాట్ చేశారు. రాష్ట్రంలో సుపరిపాలన కోసం ప్రజలు తమకు అధికారం ఇచ్చారని.. వ్యక్తిగత కక్షసాధింపుల కోసం కాదని మంత్రి నారా లోకేష్ అన్నారు. తప్పు చేసిన వారి పేర్లన్నీ రెడ్‌బుక్‌లో ఉన్నాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని కుటుంబసభ్యులతో కలవడం మరిచిపోలేనిదని చెప్పారు. క్రమశిక్షణతో ఉండాలని, ప్రకతిని ప్రేమించాలని దేవాన్ష్‌కి ప్రధాని మోదీ చెప్పారని గుర్తుచేశారు. రెండు రోజులపాటు పలువురు కేంద్రమంత్రులను ఢిల్లీలో కలిశానని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కి మంచి చేయాలన్న తపన వాళ్లందరిలో కనిపించిందని చెప్పారు మంత్రి నారా లోకేష్.

**ప్రధాని మోదీ సలహాలు, సూచనలు పాటిస్తాం..**

రాజకీయాల్లో ఎలా ఎదగాలి, కార్యకర్తలతో ఎలా మెలగాలన్న విషయాలు మోదీ చాలా చక్కగా వివరించారని మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రధాని మోదీ సలహాలు, సూచనలను ఎప్పుడూ పాటిస్తానని చెప్పారు. ప్రధానితో దాదాపు రెండు గంటలకుపైగా జరిగిన సమావేశం తన జీవితంలో మర్చిపోలేనిదని అన్నారు. ప్రధానితో జరిగిన సమావేశం తనకు మంచి ప్రేరణ కలిగించిందని తెలిపారు. ప్రతి మనిషి జీవితంలో కొన్ని పొరపాట్లు జరుగుతూ ఉంటాయని.. మనం మంచి హదయంతో పని చేస్తే ప్రజలు వాటిని అర్థం చేసుకుంటారని ప్రధాని తనకు చెప్పారని గుర్తుచేశారు. మనం చేసే పనిలో ఉద్దేశం మంచిదైతే ప్రజలు గుర్తుంచుకుంటారని అన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం ముఖ్యం కాదని.. ప్రజల హదయాలకు దగ్గరయ్యే విధంగా వాటిని అమలు చేయడమే ముఖ్యమని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

**ఎమ్మెల్యేల పనితీరుపై నివేదిక...**

ఆంధ్రప్రదేశ్ అభివద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రులు తమకు హామీ ఇచ్చారని మంత్రి నారా లోకేష్ గుర్తుచేశారు. ఏపీలో విద్యారంగంలో చేపట్టబోయే సంస్కరణల గురించి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చాలా ఆసక్తి చూపించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ అధికారులతో కలిసి మరోసారి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నైపుణ్యంతో కూడిన విద్యను ఆంధ్రప్రదేశ్‌లో అందించేందుకు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌కి సంబంధించిన సంస్థతో చర్చలు జరిపామని వెల్లడించారు. తమ ప్రభుత్వంలో ఎమ్మెల్యేల పనితీరుపైన నివేదిక తయారు చేస్తున్నామని చెప్పారు. ఒక్కొక్క ఎమ్మెల్యేని పిలిచి వాళ్ల పనితీరుకు సంబంధించిన నివేదికను వాళ్లకు అందజేస్తామని అన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు తమ పనితీరును మార్చుకోవాల్సిన అవసరం ఉందని.. దానికోసం వారికి మూడు నెలల సమయం ఇస్తామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

## ఏపీలో 1.30లక్షల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

5,451 మంది వచ్చారు. యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలి. ఎల్లుండి రాష్ట్రంలో 1.30లక్షల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు జరుగుతాయి. ప్రపంచమంతా 8లక్షల ప్రాంతాల్లో యోగాడేలో పాల్గొంటారు.''అని సీఎం చంద్రబాబు తెలిపారు.

## మందలించాల్సింది పోయి.. వెనకేసుకొచ్చిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

పోస్టర్‌లో ఉన్నది 'పుష్ప' సినిమా డైలాగ్. అది పోస్టర్‌లో పెట్టినా తప్పేనా? మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? పుష్పలో ఫొటోలు పెట్టినా, గడ్డం చేతితో రుద్దుకున్నా తప్పేనా?'' అంటూ వైఎస్ జగన్ వ్యాఖ్యానించడం గమనార్హం.

## జగన్ పల్నాడు పర్యటనపై షర్మిల కామెంట్స్

(మొదటి పేజీ తరువాయి)

చేయిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల మీద పోరాటాలు చేసే కాంగ్రెస్‌కు మాత్రమే ఆంక్షలు విధిస్తున్నారని.. జగన్ పర్యటనలకు ఎందుకు ఆంక్షలు లేవని ఏపీసీసీ చీఫ్ ప్రశ్నించారు. తాము రాజధాని మీద పోరాటం చేయాలి అనుకుంటే హౌజ్ అరెస్టులు చేస్తారన్నారు. స్టీల్ ప్లాంట్ కోసం చేసే దీక్షలు భగ్నం చేస్తారని.. ఆంక్షలు అన్ని కాంగ్రెస్ పార్టీకేనా అని నిలదీశారు. బీజేపీకి ఎదురు నిలబడి ధైర్యంగా పోరాటం చేస్తున్నందుకు కాంగ్రెస్‌ను అడ్డుకుంటున్నారా అని నిలదీశారు. జగన్ మీద ఎందుకు ఆంక్షలు లేవని అడిగారు. బల ప్రదర్శన మీద ఎందుకు ఆంక్షలు పెట్టడం లేదని.. జగన్ దగ్గర బాగా డబ్బులు ఉన్నాయనా అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.

## ఎవరి శక్తి మేరకు వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం తప్ప మిగతావన్నీ అనుమతి రాని ప్రాజెక్టులేనని చెప్పారు. 'మనం మనం కొట్లాడుకుంటే ఎవరికి లాభం? తెలంగాణపై ఎప్పుడైనా గొడవ పడ్డానా? కృష్ణాలో తక్కువ నీటిపై గొడవ పడితే లాభం లేదు. కొత్త ట్రైబ్యునల్ వచ్చాక కేటాయింపుల మేరకు ముందుకెళ్లాలి. ఏపీ, తెలంగాణ ఎవరి శక్తి మేరకు వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుందాం. ఎవరూ ఎవరిపైనా పోరాడాల్సిన అవసరం లేదు. కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయి. గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. కృష్ణానదిలో మాత్రమే నీళ్లు తక్కువగా ఉన్నాయి. కొత్త అథారిటీ ఎలా కేటాయిస్తే అలా తీసుకుందాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు నేను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు' అని చంద్రబాబు అన్నారు.

# నోట్లున్నది నిజమే

## జస్టిస్ వర్మ ఇంట్లో బయటపడ్డ డబ్బు ఆయనదే!

### జడ్జిగారింట్లో నోట్ల కట్టల వివాదం..పై న్యాయమూర్తుల ప్యానెల్ నివేదిక

### విధుల నుంచి తొలగించొచ్చని సిఫారసు?



500 నోట్ల కట్టలు చూసి షాకైన..



కొలీజియం సిఫార్సుతో అలహాబాద్ కోర్టుకు బదిలీ..

ఢిల్లీ, జూన్ 19ః జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో డబ్బు బయటపడిన మాట వాస్తవమే అని ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ వెల్లడించింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న కాలంలో అధికారిక నివాసంలో పెద్ద సంఖ్యలో కాలిపోయిన నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ నోట్లపై చాలా వివాదం రేగిన విషయం విదితమే. ఈ వివాదంపై ప్యానెల్ తాజాగా 60 పేజీల నివేదిక ఇచ్చింది. ఇందులో 30 తుగ్లక్ రోడ్డులోని న్యాయమూర్తి అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో నోట్ల కట్టలను గుర్తించడం వాస్తవమేనని పేర్కొంది. ఆ సొమ్ములున్న స్టోరూమ్ నియంత్రణ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జస్టిస్ వర్మ లేదా అతని కుటుంబసభ్యుల ఆధీనంలోనే ఉందని తేల్చింది. అగ్నిప్రమాదంలో దగ్ధమైన నోట్లను మార్చి 15వ తేదీ తెల్లవారుజామున అక్కడినుంచి తొలగించడమే ఈ అంశానికి బలమైన సాక్ష్యమని వెల్లడించింది. అసలు ఈ నోట్లను జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబసభ్యుల స్టోరూమ్లో ఉంచడం అనుమానాస్పదంగా ఉందని చెప్పింది. కాలిపోయిన నోట్లు చిన్న నోట్లు కావని, అవి తక్కువ మొత్తం కూడా కాదని నివేదిక పేర్కొన్నది. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు జస్టిస్ గా ఉన్న వర్మను విధుల నుంచి తొలగించడానికి ఈ ఆధారాలు సరిపోతాయని చెప్పింది.

జస్టిస్ వర్మపై దర్యాప్తులో భాగంగా 10 రోజులపాటు 55 మంది సాక్షులను విచారించారు. వారి వాంగ్మూలాలను వీడియోలో చిత్రీకరించారు. ఈసందర్భంగా ఓ సాక్షి మాట్లాడుతూ ''నేను ఆ గదిలోకి వెళ్లాను. అక్కడ కుడివైపు నేలపై రూ.500 నోట్ల కట్టలు భారీగా పడున్నాయి. షాకైపోయాను. నా జీవితంలో నేలపై అంత మొత్తం సొమ్ము పడి ఉండటాన్ని చూడలేదు'' అని పేర్కొన్నారు.జస్టిస్ వర్మ కుమార్తె దియా, ఆయన ప్రైవేటు కార్యదర్శి రాజేందర్ సింగ్ కార్కి, తదితరులను కూడా ప్యానెల్ విచారించింది. అగ్నిమాపక సిబ్బంది తమ నివేదికలో నోట్ల వివరాలు నమోదు చేయకుండా రాజేందర్ సింగ్ అడ్డుకొన్నారు.

మార్చి 14న ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోగా.. ఈ ఘటనలో భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు బయటపడటం కలకలం రేపింది. ఈ ఘటన అనంతరం మార్చి 28న సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసి.. ఆయనకు ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించొద్దని సూచించింది. నోట్ల కట్టల ఘటనపై సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీని నియమించింది. ఇది నిజమేనని ధ్రువీకరించిన త్రిసభ్య కమిటీ సంబంధిత నివేదికను సుప్రీంకోర్టుకు అందించింది.

# కిలో వెండి రూ. 1.21 లక్షలు

### జీవనకాల గరిష్ఠ స్థాయికి సిల్వర్ రేట్

హైదరాబాద్, జూన్ 19ః వెండి ధర రూ.1.21 లక్షలకు పెరిగింది. దీనితో జీవనకాల గరిష్ఠ స్థాయికి ఎదిగినట్టైంది .ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంతో పాటు.. బంగారం ధరలు ఇప్పటికే రికార్డు స్థాయిల్లో కొనసాగుతుండటంతో వెండిలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు విశ్లేషకులు తెలిపారు. అలాగే, పారిశ్రామిక అవసరాలకు తగినంత స్థాయిలో సరఫరా లేకపోవడం కూడా వెండి ధర లు ఎగబాకడానికి మరో కారణం. 2012 ఫిబ్రవరి తర్వాత వెండికిదే గరిష్ఠ స్థాయి. దశాబ్దానికి పైగా కాలంలో ఔన్స్ సిల్వర్ 37 డాలర్లు దాటడం ఇదే మొదటిసారి. మున్ముందు ఈ వెల మరింత పెరిగే అవకాశముంది.మార్కెట్లో కిలో వెండి రూ.2 లక్షలు దాటుతుంది.

## 15 రోజుల్లోనే ఓటరు కార్డు ఇంటికొస్తుంది

ఢిల్లీ, జూన్ 19ః ఓటర్లకు కొత్త ఓటరు కార్డులను ఇకపై 15 రోజుల్లోగా బట్వాడా (డెలివరీ) చేయనున్నామని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) బుధవారం తెలిపింది. ఇప్పటివరకు ఓటర్లకు ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డ్ (ఎపిక్) చేరేందుకు నెలకుపైగా సమయం పట్టేదని ఓ అధికారి తెలిపారు. ఇకపై కొత్త ఓటర్లకు, ఇప్పటికే ఓటరుగా నమోదై వివరాల్లో మార్పులు చేర్పులు చేసుకున్నవారికి కొత్త ఓటరు కార్డులు 15 రోజుల్లోగా అందించేందుకు వీలుగా నూతన ప్రామాణిక నిర్వహణ విధానాన్ని (ఎస్ఓపీ)ని ప్రవేశ పెట్టినట్లు ఈసీ తెలిపింది. ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) ఎపిక్ జనరేట్ చేసినప్పటి నుంచి ఓటరుకు పోస్టల్ విభాగం ద్వారా బట్వాడా అయ్యే వరకు ప్రతి దశలోను రియల్ టైమ్ ట్రాకింగ్ కొత్త వ్యవస్థ వీలు కల్పిస్తుందని ఎన్నికల సంఘం వెల్లడించింది.

# ఇరాన్ నోట 'హర్మూజ్' మూసివేత ప్రస్తావన




(మొదటి పేజీ తరువాయి)

నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒకవంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడినుంచే వివిధ దేశాలకు చేరుతుంది. ఇరాన్‌లోని బుషెహర్ అణువిద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో రష్యా స్పందించింది. తక్షణమే దాడులను ఆపాలని ఆ దేశానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రష్యా విదేశాంగశాఖ మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌ని బుషెహర్ ప్రాంతంలో ఈ అణు విద్యుత్ కేంద్రం ఉంది. ఇరాన్ ఏర్పాటు చేసుకున్న ఒకే ఒక వాణిజ్య స్థాయి అణు విద్యుత్ కేంద్రమిది. ఇది టెహ్రాన్ నగరానికి 750 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని నిర్మాణంలో ఇరాన్‌కు రష్యా సాయమందించింది. రష్యాలో ఉత్పత్తి అయిన యురేనియం ఈ అణు విద్యుత్ కేంద్రానికి ఇంధనంగా ఉపయోగపడుతోంది.

## మా తప్పేం లేదు



ఢిల్లీ, జూన్ 19ః అహ్మదాబాద్లో ఎయిరిండియా విమాన దుర్ఘటనపై ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ వివరణ ఇచ్చారు. ఈ ఏడాది మార్చిలోనే మరమ్మతులు నిర్వహించి కుడి ఇంజన్ను మార్చామని, ఏప్రిల్లో ఎడమవైపు ఇంజన్ను కూడా టెస్ట్ చేశామని తెలిపారు. ప్రమాదానికి గురైన విమాన నిర్వహణలో ఎలాంటి లోపాలు లేవని స్పష్టం చేశారు. రెండున్నరేళ్లకోసారి పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తామన్న ఆయన జూన్ 2023లోనే ఆ విమానానికి తనిఖీలు పూర్తయిందన్నారు.

పైలట్ సుమిత్ సభర్వాల్, ఫస్ట్ ఆఫీసర్ క్లైవ్ కుమార్కు 13,400 గంటలపాటు విమానాన్ని నడిపిన అనుభవముందని చెప్పారు. విమానం బయల్దేరడానికి ముందుకూడా పని తీరును పరిశీలించామని, ఎలాంటి సమస్యలు లేవన్నారు. ఈ దుర్ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందని, విచారణలో అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పారు.



## బాంబుల మోతలు మా చెవుల్లో ఇంకా మారుమోగుతూనే ఉన్నయ్

(మొదటి పేజీ తరువాయి)

ఇంటికి చేరగలమన్న నమ్మకం ఏర్పడింది' అని అన్నాడు.

**అందరినీ రప్పిస్తాం..**

ఇరాన్ నుంచి భారత్ చేరుకున్న వైద్య విద్యార్థులకు కేంద్ర మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ స్వాగతం పలికారు. ఢిల్లీ ఎయిర్పోర్టుకు వెళ్లి.. వారితో నేరుగా మాట్లాడి అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మిగతా వారిని కూడా స్వదేశానికి రప్పించేందుకు కేంద్రం తీవ్ర కసరత్తు చేస్తోందని చెప్పారు. తుర్కెమిస్థాన్ మీదుగా

మరికొందర్ని రప్పించేందుకు ఇప్పటికే విమానాలు సిద్ధం చేసి ఉంచినట్లు చెప్పారు. అవసరమైన అనుమతులు రాగానే తరలింపు మొదలుపెడతామని వెల్లడించాడు.

# రెడ్బుక్ రాజ్యాంగం వద్దు.. అంబేద్కర్ రాజ్యాంగమే ముద్దు

### నిరసనలో పాల్గొన్న చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ

చంద్రగిరి, జూన్ 19 (మనం న్యూస్)ః ఏపీలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని.. అంభేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని చంద్రగిరిలో వైఎస్ఆర్సీపీ నేతలు కార్యకర్తలు రోడ్డెక్కారు. చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కరెడ్డి అరెస్టును వ్యతిరేఖిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చెవిరెడ్డిని వెంటనే విడుదల చేయాలి.. చెవిరెడ్డిపై కూటమి ప్రభుత్వం కుట్రలు.. సిగ్గో..సిగ్గు.. చెవిరెడ్డి మోహిత్రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి.. జైజగన్.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం అప్రజాస్వామికంగా చెవిరెడ్డిని అరెస్టు చేయించి కక్ష సాధింపు చర్యలకు




పాల్పడుతోందన్నారు. చెవిరెడ్డిని మానసికంగా దెబ్బతీయడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని, ఆయన ఈ కేసులకు భయపడే వ్యక్తి కాదన్న విషయం పోలీసులు, ప్రభుత్వ పెద్దలు గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. జైలుకు వెళుతున్నామని తెలిసినా చెవిరెడ్డి సిట్ అధికారులపై మీడియా ముందు ఆరోపణలు చేయడంతో ఆయన కుమారునిపై కేసు పెట్టి నోరుమూయించే ప్రయత్నం చేశారన్నారు. అయినా సరే సిట్ అధికారులు చేసిన తప్పులను బయటపెట్టిన చెవిరెడ్డి చివర వరకు పోరాటం సాగించారన్నారు. చివరకు విమానాశ్రయంలో అరెస్టు చేసి విజయవాడకు తీసుకువెళ్లి జైలుకు తరలిస్తున్నా సరే చెవిరెడ్డి సిట్ అధికారుల అరాచకాలు, అక్రమాలను మీడియా ముందు పెట్టారన్నారు. చెవిరెడ్డిని ఎవ్వరు ఏమీ చేయలేరని, ఆయన జైలు నుంచి వచ్చేంత వరకు ఆ కుటుంబానికి తాము అండగా నిలబడతామన్నారు. చంద్రగిరిలో చెవిరెడ్డి కుటుంబం వుంటే పట్టు కోల్పోతామన్న భయంతోనే వారిని అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంకు వైఎస్ఆర్సీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**ఏం తప్పు చేశాం.. ప్రజలకు మంచి చేయడమా..?**

'మేం ఏం తప్పు చేశాం.. ప్రజలకు మంచి చేయడమా...? ఎందుకు మమ్మల్ని టార్గెట్ చేశారు.. ఇంత అధర్మంగా పరిపాలన చేస్తారనుకోలేదు.. ధర్మం తప్పి చంద్రబాబు పాలన చేస్తున్నారు. అధికారంలోకి రాగానే మమ్మల్ని టార్గెట్ చేశారు.. ఒక ఆడబిడ్డ రోడ్డుపైకి వచ్చి మీడియా ముందు మాట్లాడుతోందంటే ఆ కుటుంబం ఎంతలా బాధింపబడిందో అర్థం చేసుకోవాలి. ప్రజలకు మంచి చేయడం తప్ప తప్పులు చేయడం మాకు తెలియదు. అయినా సరే అరెస్టు చేశారు. మేము అధికారంలో వున్నపుడు ఈ చంద్రగిరి నియోజకవర్గంలో ఒక్కరిని కూడా అరెస్టు చేసి జైలుకు పంపలేదు.. అయినా సరే వేధిస్తున్నారు.. భరిస్తాం.. ఎవ్వరు ఏం చేశారు అన్నది ప్రజలు గుర్తిస్తారు.' అంటూ చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ వెల్లడించారు. చంద్రగిరి క్లాక్టవర్ వద్ద నిర్వహించిన నిరసనలో పాల్గొన్న ఆమె ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం చచ్చిపోయిందని కొంత సమయం మౌనం పాటించారు. అనంతరం నిరసనలో పాల్గొని మీడియాతో మాట్లాడుతూ పైవ్యాఖ్యలు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో చంద్రగిరి,పాకాల యంపిపి లు హేమేంద్ర కుమార్ రెడ్డి,లోకనాథం, వైయస్సార్ సిపి నాయకులు కొటాల చంద్రశేఖర్ రెడ్డి,ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి,చెవిరెడ్డి రఘునాథరెడ్డి, చిన్నియాదవ్,బొజ్జా వెంకటరత్నం,అగరాల దేవారెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెంగల్రాయులు, చెంచుమోహన్ యాదవ్,మస్తాన్,బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి,కేశవులు,హరిప్రసాద్ రెడ్డి, ఎ.చంద్రశేఖర్ రెడ్డి,శంకర్ యాదవ్,తుంటి సుధా యాదవ్,ఉమాపతి,అగరాల భాస్కర్ రెడ్డి,ఒంటి శివారెడ్డి,అజయ్, సూరి,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# మామిడి రైతులకు నష్టం వాటిల్లకుండా కొనుగోలు

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు, జూన్ 19 (మనం న్యూస్)ః జిల్లాలో పండే మామిడికి చిట్టచివరి కాయ అమ్ముడుపోయే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రభుత్వం అందించే 4 రూపాయలు మద్దతు ధర సబ్సిడీ రూపంలో రైతు వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు జమ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ లో మామిడి మండి యాజమానులు, రైతులతో మామిడి మద్దతు ధర పై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ తోతాపురి మామిడిని చివరి కేజీ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని తెలిపారు. రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు ఆందోళన చెంది పక్వానికి రాక మునుపే మామిడి కాయలను గుజ్జు పరిశ్రమలకు తరలించవద్దని సూచించారు. మండలాల్లో గ్రామ సభల ద్వారా మామిడి అమ్మకం పై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు ట్రేడర్స్ పైన ఆధార పడవద్దు. చిన్న సన్నకారు మామిడికాయ రైతులు పక్వానికి వచ్చిన మామిడికాయలని కంపెనీలకు తరలించాలని రైతులకు పిలుపునిచ్చారు. క్రిష్ణగిరికి జిల్లా అధికారుల కమిటీతో ఒక బృందం పంపడం జరిగిందని అక్కడ కొనుగోలు ఎలా జరుగుతున్నాయి వాటిని ఎలా అమలు చేస్తున్నారు రైతులకు ఎలాంటి రుసుము అందజేస్తున్నారు తెలుసుకోవడానికి బృందం పంపడం జరిగిందని రెండు రోజుల్లో బృందం నివేదికలు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో తోటాపురి రైతులు ఫ్యాక్టరీలకు అమ్మిన, వర్తకులకు మామిడికాయల అమ్మిన, భూమి పైన ఉన్న మామిడి పంటని వర్తకులు అమ్మిన వారికి ప్రభుత్వం తరఫున కిలోకి నాలుగు రూపాయలు సబ్సిడీ అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు మామిడి రైతులకు సలహాలు, సూచనల కొరకు ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద షిఫ్ట్ ల వారీగా ప్రభుత్వ ఉద్యోగులను నియమించడం జరిగిందన్నారు. మన జిల్లాలో మామిడి పండించే రైతులు ఎటువంటి ఇబ్బంది పడకూడదని, ముఖ్య మంత్రి వర్యుల నిర్ణయం మేరకు ప్రతి రైతుకు కేజీ కి రూ.4 చొప్పున వారికి మద్దతు ధర ఇచ్చేందుకు



రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ ను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. చిత్తూరు జిల్లాకు చెందిన వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉద్యోగులను, తాహసిల్దార్లను పెట్టి ఎక్కడెక్కడ ఎంత మామిడి వస్తుంది, ఏ వ్యాపారి కొంటున్నారు, ఎటువైపు వెళ్తుంది, ఏ రైతు నుండి కొన్నారు తదితర వివరాలు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతులకు మనదగ్గర పండేటటువంటి మామిడి కాయలకు చిట్టచివరి దాకా జూన్ మొదటి వారం నుండి జూలై, ఆగస్టు నెల చివరి కాయ వరకు ఎంత పంట వస్తుందో దానంతటిని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం వారు అందించే 4 రూపాయల మద్దతు ధర ఆగిపోతుందనే అపోహ వలన ఎక్కువ మంది రైతులు పంటని కోత చేసి త్వరగా మార్కెట్ లోకి తీసుకొస్తున్నారని, పల్ప్ యూనిట్ యొక్క స్టోరేజ్ సామర్థ్యం, ప్రాసెసింగ్ సామర్థ్యానికి మించి మనము తీసుకెళ్తే అక్కడ వెయిటింగ్ టైమ్ పెరుగుతుందన్నారు. దానిని నివారించడానికి మామిడి రైతులందరూ నెమ్మదిగా పక్వానికి వచ్చినటువంటి కాయలను మాత్రమే తీసుకురావాలని, ఆగస్టు మొదటి వారం వరకు చివరి కాయవరకు ప్రభుత్వం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఉద్యాన వాన శాఖ ద్వారా ఏ ఏ రైతు పంట ఎప్పుడు కోతకు వస్తుందో నిర్ణయించి వాటిని వ్యాపారులతో అనుసంధానిం చాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇప్పటివరకు వివిధ ఫ్యాక్టరీలలో 60 వేల మెట్రిక్ టన్నులు నిల్వ ఉన్నాయి. జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు పనిచేస్తున్నాయని తెలిపారు, ఫ్యాక్టరీలు రాంపులు వద్ద ధరలు పట్టిక తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. మన మామిడి పంటను ఇతర రాష్ట్రాలు పంపడానికి కూడా చర్యలు చేపట్టడం జరుగుతుందని, గుజరాత్ బలగామ మార్కెట్ ప్రదేశాలలో తరలించడానికి ప్రభుత్వం అనుమతి తీసుకుని ఎగుమతి చేయడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, మార్కెటింగ్ ఏడి పరమేశ్వరం ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి ,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని కుల ఆధిపత్య రాజకీయాలకు 'ప్రత్యామ్నాయం'

- **ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు**

**తిరుపతి, జూన్ 19(మనం న్యూస్) :** మన రాష్ట్రంలో రెండు కులాలు ఎవరికి వారు ప్రత్యేకంగా రాజకీయ పార్టీలు పెట్టుకుని, బహుజన కులాల్లో చీలికలు తెచ్చి వారిని తమ వెంట నడిపించుకుంటూ అధికారంలోకి వస్తున్నాయని.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్లకు మాత్రం రాజ్యాధికారం ఇంతకాలం దక్కకుండానే పోయిందని ఏఐబీఎస్పీ జాతీయ సమన్వయకర్త, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు అన్నారు. బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రిస్టియన్లకు రాజ్యాధికారమే లక్ష్యంగా వారందరినీ ఏకతాటిమీదకు తీసుకురావడానికి ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ (ఏఐబీఎస్పీ) కృషి చేస్తోందని ఆయన చెప్పారు. తిరుపతిలో ఆయన ఏఐబీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్క పరంజ్యోతితో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు.



**బీసీల నుంచి ఒక్క సీఎం లేరేం?**

మహాత్మ జ్యోతిరావు పూలే , బాబాసాహెబ్ అంబేద్కర్ , పెరియార్ రామస్వామి నాయకర్, కాన్షీరామ్ తదితర నాయకుల ఆశయాలకు, ఆలోచన విధానాలకు కట్టుబడి దక్షిణ భారతదేశంలో బహుజనులను అధికారంలోకి తెచ్చేందుకు ఆలిండియా బహుజన్ సమాజ్ పార్టీ కార్యక్రమాలను దక్షిణాది రాష్ట్రాలలో ప్రారంభించింది. దక్షిణాది రాష్ట్రాలలోని సామాజిక, రాజకీయ, పరిస్థితుల ఆధారంగా ఏఐబీఎస్పీ రాష్ట్రాల వారీగా రాజకీయ సమీకరణలు, ఎత్తుగడలను రూపొందించుకుంటుంది. ఏపీ విషయానికే వస్తే.. గట్టిగా 8% జనాభా కూడా లేని కమ్మ, రెడ్డి లాంటి ఆధిపత్య కులాలు టీడీపీ, వైసీపీ లాంటి పార్టీలను నడిపిస్తూ మిగిలిన 92% ప్రజలను పరిపాలిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం 52 శాతం ఉన్న బీసీ వర్గాల నుంచి రాష్ట్రంలో ఇంతవరకు ఒక్క ముఖ్యమంత్రి కాలేదు. బహుజనులంతా కేవలం కమ్మ, రెడ్డి పార్టీలకు ఓట్లు వేసే వారుగా మారిపోయారు. వీళ్లు అధికారంలో ఉన్నంతకాలం బహుజనుల నుంచి ఏ ఒక్కరూ ముఖ్యమంత్రి కాలేరు. పాలక, పాలిత కులాలుగా ఉన్న రాజకీయ సమీకరణలు మార్చడమే ఏఐబీఎస్పీ లక్ష్యం. బహుజనులకు నామమాత్రంగా పదవులు ఇచ్చి, అధికారాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుంటున్న ఆధిపత్య కులాల రాజకీయ కుట్రలను బహుజనులు ఇప్పుడే అర్థం చేసుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో రెండు కులాల పార్టీలకు రాజకీయసమాధి కట్టి, బహుజన కులాలను అధికారంలో తీసుకురావడానికి అన్ని సామాజిక వర్గాలను ఏఐబీఎస్పీ ఐక్యపరుస్తుంది.

**ఉన్నతాధికారులు రాజకీయాల్లోకి రావడం మంచిదే**

ఇప్పుడు క్రమంగా ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత ఉద్యోగాలు చేసినవాళ్లు రాజకీయాల్లోకి వస్తున్నారు. ఇది స్వాగతించదగ్గ పరిణామం. బీసీ వర్గానికి చెందిన పి.నరహరి.. ఐఏఎస్ సర్వీసులో ఉండగానే ఓబీసీ పోరుబాట అనే పుస్తకాన్ని రాశారు. ఐఏఎస్ అధికారి చిరంజీవి, ఐపీఎస్ అధికారి అయిన నేను పదవీవిరమణ చేసిన తర్వాత బీసీ ఉద్యమం వైపు ఆకర్షితులై ఈ రాజకీయాల్లోకి వచ్చాం. ప్రవీణ్ కుమార్ ఏడు సంవత్సరాల సర్వీస్ ఉండగానే రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. ఇలా చాలామంది ఆల్ ఇండియా సర్వీసెస్ వాళ్ళు రావడం చాలా శుభ పరిణామం. స్వాతంత్ర్య సమరం సమయంలో చాలామంది ఐసీఎస్ అధికారులు, న్యాయవాదులు రాజకీయాల్లోకి వచ్చారు. వాళ్లే భారత దేశానికి బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కలిగించారు.

**కులతత్వంపై పోరాడుదాం**

ఇంతకాలం మనం కమ్యూనిజం, సోషలిజం లాంటి ఉద్యమాలు చూశాం. అలాగే ప్రాంతీయవాదం, మతతత్వ వాదం కూడా చూశాం. ఇప్పుడు కులతత్వానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. ఆధిపత్య కులాల పాలన నుంచి మనమంతా బయటపడాలంటే బీసీలు ఏకం కావాలి. ఎస్సీ, ఎస్టీ, ముస్లింలతో కలిసి వెళ్లాలి. పాలక కుల ప్రభుత్వ పెద్దలు మన కులం వాళ్ళు ఎక్కడ ఉన్నారు, వాళ్లని ఎలా మనం పెద్ద పోస్టుల్లో వెయ్యాలని చూస్తారు. పెద్ద పదవులు ఇవ్వాలంటే సీనియారిటీ అక్కర్లేదు.. తమవాళ్లయితే అందలాలు ఎక్కిస్తున్నారు.

**బ్లాక్ షర్ట్ మూమెంట్ మొదలుకావాలి**

ఈ కులాలు వద్దని ఉద్యమం మొదలుపెట్టింది పెరియార్ రామస్వామి నాయకర్. 80 ఏళ్ల క్రితం తమిళనాట మొదలుపెట్టిన ఈ ఉద్యమం వల్లే ద్రవిడ కళగం పుట్టింది. అక్కడ మరే ఇతర పార్టీలూ దూరలేకపోతున్నాయంటే అందుకు ఆ ఉద్యమమే కారణం, పెరియార్ ప్రారంభించిన బ్లాక్ షర్ట్ మూమెంట్ అన్ని కులాలకూ అధికారాన్ని పంచింది. ఇక్కడ కూడా మనం బ్లాక్ షర్ట్ మూమెంట్ తీసుకురావాలి. ఏ పార్టీలో ఉన్నా తెలంగాణ తెచ్చుకోవడంలో అందరూ ఏకమైనట్లే.. ముస్లింలు, క్రిస్టియన్లు, బీసీలందరూ ఏకం అవ్వాలి. ఎస్సీ ఎస్టీలతో కలిసి నడవాలి. కులతత్వ పాలన పై నిరసన తెలపడానికి నల్లచొక్కలు వేసుకోండి. మీ నిరసనను తెలియజేయండి. మీ సమస్యలు పరిష్కారం అవుతాయి. ఇది పెరియార్ మార్గం. ఈ ఉద్యమం తిరుపతి నుంచి మొదలైతే.. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం ఈ ఉద్యమ ప్రభావంతో ఈ కులశక్తులను నియంత్రించగలం

జనాభా ఎక్కువున్న బీసీ ముస్లింలకు తక్కువ ఎమ్మెల్యేలు, అతి తక్కువ జనాభా ఉన్న కమ్మ రెడ్డి కులాలకు అత్యంత ఎక్కువ ఉన్నారు. జనాభా దామాషా పద్ధతి లో బీసీ ముస్లింల ఎమ్మెల్యే లుండాలంటే కేంద్రం కులగణన జరిపి కులాల లెక్కల్ని వెబ్ సైట్ లో ఉంచి చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలి. అ దిశగా 92 శాతం ప్రజల్ని సమాయత్తం చేస్తుంది.

రాష్ట్ర కాబినెట్ లో జనాభా దామాషాలో బీసీ లకు 6 మంత్రి పదవులు, ముస్లింలకు ఎస్టీలకు చెరొక మంత్రి పదవి ఇవ్వాలి. ఎస్సీలకు మరో మూడు మంత్రి పదవులు ఇవ్వాలి...

టీటీడీ బోర్డు లో ఎస్సీ, ఎస్టీ, బీసీ బిందువులకు జనాభా దామాషాలో మెంబర్షిప్ ఇవ్వడమే కాకుండా వారిలో హిందువులలో ఒకరిని టీటీడీ బోర్డు చైర్మన్ పదవి ఇవ్వాలి. ఎలా అయితే టీటీడీ బోర్డు లో అన్య మతస్థుల కు వాటా ఇవ్వరో అలాగే వక్ఫ్ బోర్డు లో ముస్లిమేతరులు సభ్యులో కాకుండా చట్ట సవరణ చేయాలి.

## ఆన్ లైన్ ద్వారా మొబైల్ ఫోన్లు ఈ - వేలం

**తిరుపతి, జూన్ 19 (మనం న్యూస్) :** తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన ఉపయోగించినవి / పాక్షికంగా దెబ్బతిన్న 74 లాట్ల మొబైల్ ఫోన్లను జూన్ 20 నుండి 21వ తేదీ వరకు టిటిడిలో ఆన్ లైన్ ద్వారా ఈ - వేలం వేయనున్నారు. కార్బన్ , ఎల్ వై ఎఫ్, నోకియా, శాంసంగ్, లావా, ఐటెల్, లెనోవా, ఫిలిప్స్, ఎల్.జి.సాంసుయ్, ఒప్పో, పోకో, ఏసర్, పానాసోనిక్, హానర్, వన్ ప్లస్, బ్లాక్ బెర్రి, ఎంఐ, జియోనీ, మైక్రోసాఫ్ట్ ,



ఆనస్, కూల్ పాడ్, హెచ్ టి సి, మోటోరోలా, టెక్నో, ఇంఫినిక్స్, రియల్ మీ, హువాయ్, సెల్కన్, వివో, మైక్రో మాక్స్ మరియు మొబైల్ ఫోన్లు ఈఏఐడి నెం. 25132, 25133, 25134, 25135 ఆన్ లైన్ లో ఈ - వేలం వేయనున్నారు. ఆసక్తి కల్గిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈ - కొనుగోలు పోర్టల్ లో రిజిస్టర్ అయిన బిడ్డర్లు వేలంలో పాల్గొనటానికి అర్హులు. ఇతర వివరాలకు స్థానిక జనరల్ మేనేజర్( వేలంలు), / ఏఈవో ( వేలంలు), టిటిడి, హరే కృష్ణ మార్గ్, తిరుపతిలో లేదా టిటిడి వెబ్ సైట్ లేదా 0877 - 2264429 ఫోన్ నెంబర్ ద్వారా గాని సంప్రదించాలన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలు



- **కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కాంగ్రెస్ పార్టీ నేతలు**

**తిరుపతి,జూన్ 19 (మనం న్యూస్) :** ఏఐసీసీ మాజీ అధ్యక్షులు, భారతదేశ పార్లమెంట్ లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ 54వ జన్మదిన వేడుకలను తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌడపేరు చిట్టబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా గౌడపేరు చిట్టబాబు మాట్లాడుతూ భారతదేశ సమగ్ర అభివృద్ధికి రాహుల్ గాంధీ నాయకత్వం ఎంతైనా అవసరమని అన్నారు. జీవితంలో ఊహించని ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని మేరు శిఖరంలా నిలబడ్డారని కొనియాడారు. దేశ సమగ్రత, సమైక్యతతో పాటుగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు అందాలంటే అది రాహుల్ గాంధీ తోనే సాధ్యమవుతుందన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఆయన నిండు నూరేళ్లు దేశ అభ్యున్నతికి ప్రగతికి దోహదపడే శక్తి సామర్థ్యాలు కడిగి ఉండాలని ఆకాంక్షించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వానికి దేశ ప్రజలు ముఖ్యంగా మేధావులు, విద్యార్థులు, యువత అండగా నిలవాలని పిలుపునిచ్చారు. లౌకిక భారత దేశంలో మతోన్మాద శక్తులకు స్థానం లేదని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే దిశగా రాహుల్ గాంధీ చేస్తున్న ప్రయత్నానికి యావత్ ప్రజలు అండగా నిలవాలని తెలియజేశారు.

2024 భారత సార్వత్రిక ఎన్నికలకుముందు రాహుల్ గాంధీభారత్ జోడో యాత్రమరియుభారత్ జోడో న్యాయ్ యాత్రలను నిర్వహించి దేశ ప్రజలను ఒక్క తాటిపైకి తెచ్చారని తెలిపారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు మాట్లాడుతూ 2024 ఎన్నికలలోరాయ్బరేలి లోక్సభ నియోజకవర్గం నుండి గెలిచిప్రతిపక్ష నాయకుడిగానామినేట్ అయ్యారని దేశం కోసం ప్రత్యేకంగా గ్రామీణాభివృద్ధి, విద్య, ఉపాధి మరియు మహిళా సాధికారత వంటి అంశాలపై దృష్టి సారించి ఆదిశగా ప్రజలను చైతన్య వంతం చేస్తున్నారని చెప్పారు. రాజకీయాల్లో యువత భాగస్వామ్యం ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ దేశ భవిష్యత్తును రూపొందించడంలో యువతను భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. డిసీసీ ఉపాధ్యక్షుడు కళందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహించిన రాహుల్ గాంధీఎన్నికల ప్రచారంలో 20 శాతం పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 6,000 చొప్పున హామీ ఇస్తున్న కనీస ఆదాయ హామీ పథకాన్ని ప్రకటించారని తెలిజేశారు. దేశంలో పేదరికాన్ని నిర్మూలించాలన్న కృతనిశ్చయంతో ఉన్నారని ఆయనకు ప్రజలు బాసటగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ కార్యదర్శి సుప్రజ, తిరుపతి నగర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు పార్థసారధి రెడ్డి, గొడుగు చింతల గోపి, ప్రధాన కార్యదర్శి తలారి గోపీచంద్, శివకుమార్, రెడ్డిపల్లి రమేష్, కార్యదర్శి వెంకటేష్, కార్యనిర్వాహక కార్యదర్శి తవన్ కళ్యాణ్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు సలీముల్లా, కార్యవర్గ సభ్యుడు ఎం వాసు, ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, తిరుపతి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి సేవలో తెలంగాణ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్

**తిరుమల, జూన్ 19(మనం న్యూస్) :** తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు తెలంగాణ కార్మిక,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి. వీరికి ముందుగా టిటిడి అధికారులు దర్శన ఏర్పాట్లు చేసారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, టిటిడి



అదనపు ఈఓ వెంకయ్య చౌదరి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల తెలంగాణ మంత్రి మీడియాతో మాట్లాడుతూ, నేను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీవారి ని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలని సంక్షేమ పథకాలు అమలు కావాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఇంద్రమ్మ ఇల్లు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, ఇందిరమ్మ పక్కా ఇల్లు కట్టిస్తే 12 ఏళ్ల తెలంగాణ ప్రజల కల నెరవేరుతుందని వారు అభిప్రాయపడ్డారు. రైతు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, రాజు ఆరోగ్యశ్రీ, సన్న బియ్యం వితరణతో ప్రజలు సంతోషంగా ఉన్నారని మంత్రి వివేక్ తెలిపారు.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష

- **రూ. 6లక్షల జరిమానా**
- **తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి**

**తిరుపతి, జూన్ 19 (మనం న్యూస్) :** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ఏఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 74/2017 కేసులో ఒక ముద్దాయి అరెస్టయ్యాడు. ఇతను తమిళనాడుకు చెందిన పరమన్ అన్బు కాగా, ఎర్రచందనం అక్రమ రవాణా



చేస్తూ కరకంబాడీ ఫారెస్ట్ బీటు, కృష్ణాపురం సెక్షన్ తిరుపతి లో పట్టుబడ్డాడు. ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తడుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడవిలోకి అక్రమ ప్రవేశం చేసిన నేరస్తులకు కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు అధికారులు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని అభినందించారు.

## మహిళలు హక్కులను కాపాడుకోవడానికి హెల్ప్ లైన్, మెయిల్

- **జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డా. అర్చన మంజుదార్**

**తిరుపతి, జూన్ 19 మనం న్యూస్ :** మహిళల రక్షణ, వారి హక్కుల పరిరక్షణ కోసం మహిళా కమిషన్ కృషి చేస్తుందని, మహిళల రక్షణ కోసం 24 గంటలు హెల్ప్ లైన్/ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదారి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరట్ లోని సమావేశ మందిరం నందు ఏర్పాటు చేసిన రాష్ట్రీయ మహిళా ఆయోగ్ ఆప్కే ద్వార్, మహిళా జన్ సున్వై అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్ పి హర్ష వర్ధన్ రాజు.. ఈ సందర్భంగా జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు మహిళల భద్రత, వారి హక్కుల ను కాపాడటౌ గురించి మాట్లాడుతూ.. మహిళలు రక్షణ వారి హక్కుల పరిరక్షణ కోసం మహిళా కమిషన్ కృషి చేస్తుందని, మహిళల రక్షణ కోసం 24 గంటలు మహిళా కమిషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. బాధితులు ఏ సమయంలోనైనా తమకు ఫిర్యాదు చేయవచ్చని తక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. తమ సమస్యలను హెల్ప్ లైన్/ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని అన్నారు. జిల్లాలో మహిళలకు సంబంధించిన కేసును పరిష్కరించడానికి ఈరోజు సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. వరకట్నం, సైబర్ నేరాలు, లైంగిక నేరాలు, ఆర్థిక సమస్యలు వంటి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోనే మహిళలకు సంబంధించిన చాలా కేసులు పెండింగ్లో ఉన్నాయని త్వరితగతిన వాటిపైన కూడా యాక్షన్ తీసుకొని తొందరగా పరిష్కారం చూపుతామని తెలిపారు. తిరుపతి జిల్లా కు సంభందించి చాలా కేసు లు వచ్చాయనీ వాటికి కూడా వెంటనే పరిష్కరిస్తాం అని అన్నారు

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మహిళ ల కు సంభందించిన సమస్యలను పరిష్కరించే దిశగా ఈరోజు జాతీయ మహిళా కమిషన్ జిల్లాకు రావడం జరిగింది తెలిపారు. 8 జిల్లాలకు గ్రీవెన్స్ కు సంబంధించిన మహిళా జన్ సున్వై ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చిన ప్రతి సమస్యలను మహిళా కమిషన్ వారి సమస్యలను విని అక్కడికక్కడే




విని ప్రతి కేసుకు సంబంధించిన పురోగతి వివరాలను తెలుసుకొని న్యాయం జరిగేలా చూస్తారని తెలిపారు. జిల్లాలోని మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్చి మహిళా కమిషన్ అప్పటికప్పుడే స్పందిస్తుందని అన్నారు. మహిళలు తమ సమస్యలను ఏ సమయంలో అయినా హెల్ప్ లైన్/ మెయిల్ ద్వారా తెలపవచ్చని, ఈ విషయంలో జిల్లా యంత్రాంగం తరపున అడ్మినిస్ట్రేషన్, పోలీస్ శాఖ టేక్ అప్ చేసి విచారణ చేయడం జరుగుతుందని అందరికీ తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. మహిళల రక్షణ కోసం, మరియు వారి సమస్యలను చెప్పుకోవడానికి ఇది ఒక మంచి వేదిక అని తెలిపారు. కమిషన్ ముందే కంటే కూడా మహిళా శిశు సంక్షేమ శాఖ వారి దృష్టికి వచ్చిన కేసులను విచారణ చేపట్టి వాటిని పరిష్కరించిన యెడల చాలా కేసులు తగ్గే అవకాశం ఉందని తెలిపారు.ఇక్కడికి వచ్చిన ప్రతి మహిళ కూడా తమ సమస్యలకు సంభందించిన గ్రీవెన్స్ లను మహిళా కమిషన్ కు తెలుపవచ్చు అని తెలిపారు.

ఎస్పీ మాట్లాడుతూ.. మహిళలకు సంబంధించిన ప్రతి సమస్యను పర్సనల్ గా తీసుకొని పరిష్కారం చూపేలా మహిళా కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. కంప్లైంట్ చేసిన వారు మరియు రెస్పాండెన్స్ వారి సమస్యలను నేరుగా తెలుపవచ్చు అన్నారు. జాతీయ కమిషన్, బృందం సమస్యలను విని ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ఎలా సమస్యలను పరిష్కరించాలి అనే దిశగా అర్జీలదారులకు పరిష్కారం చూపుతారని అలాగే వారికి తొందరగా న్యాయం కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి , చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం,కడప జిల్లాల పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో రోఖాయ బేగం మెంబర్, అడ్వకేట్ లు కంచి శ్యామల,కోమలాదేవి శారద, నేశమ చౌదరి, చంద్రశేఖర్, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి వసంత బాయి, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రమం తప్పకుండా శాఖల వారీగా భక్తుల నుండి అభిప్రాయ సేకరణ

- **టిటిడి ఈవో జె. శ్యామలరావు**

**తిరుపతి, జూన్ 19, మనం న్యూస్ :** శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానములు అందిస్తున్న సేవలపై క్రమం తప్పకుండా అభిప్రాయ సేకరణ ప్రామాణికంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామని టిటిడి ఈవో శ్రీ జె. శ్యామల రావు తెలిపారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయ సేకరణపై వివిధ విభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీవారి దర్శనం, అన్నప్రసాదాలు, వడ పంపిణీ, వసతి, కాలినడక భక్తులకు అందితున్న సేవలు, లగేజీ, కళ్యాణకట్ట, వైద్యం, పారిశుధ్యం, పరిశుభ్రత, విజిలెన్స్, ట్రాన్స్ ఫోర్ట్ తదితర అంశాలపై భక్తుల నుండి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నామని, భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. శ్రీ మాతృశ్రీ తరిగొండ అన్నప్రసాద భవనంలో పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా అదనపు హాళ్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులను సూచించారు. భక్తులకు అన్నప్రసాదాల పంపిణీలో ఆలస్యం చేయకుండా క్రమపద్ధతిలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బియ్యం, వంట సరుకుల నాణ్యత



పరీక్షించేందుకు ఆధునిక పరికరాలను ఉపయోగించి భక్తులకు మరింత రుచికరమైన అన్నప్రసాదాలను అందించాలని కోరారు. వసతి గృహాలలో సకాలంలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించేందుకు వీలుగా రిసెపక్షన్, ఐటీ విభాగాలు సమన్వయంతో ఎఫ్.ఎమ్.ఎస్ యాప్ ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. భక్తుల రద్దీ సమయాలలో లడ్డూ కౌంటర్లలో భక్తులకు ఇబ్బంది లేకుండా, ఆలస్యం చేయకుండా లడ్డూలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రద్దీకి తగ్గట్టుగా లడ్డూ కౌంటర్లలో సిబ్బందిని నియమించాలన్నారు. తిరుపతి, తిరుమల ప్రాంతాలలో రవాణా వ్యవస్థ మీద విజిలెన్స్, పోలీస్, ట్రాన్స్ పోర్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి నిఘాను మరింత పెంచాలని , కల్యాణకట్టలో విజిలెన్స్ విభాగం, కల్యాణకట్ట విభాగాలు మరింత సమన్వయంతో భక్తులకు సేవలు అందించాలని సూచించాలన్నారు. తిరుమలలో ఉచిత బస్సుల సేవలపై భక్తులకు తెలిసేలా ఎప్పటికప్పుడు ప్రకటనలు ఇవ్వాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, శ్రీవారి సేవకులను నియమించి అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ ద్వారా అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, తిరుపతి పరిపాలనా భవనం నుండి జేఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్వో మురళీ కృష్ణ, సీఈ టివి సత్యనారాయణ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## శాంతి క్రాంతి పావురం

ఆధిపత్యం
ఆధిపత్యం
అగ్ర రాజ్య అధిపత్యం
అణు సంపద
ఆయుధ సంపత్తి
అణువంతా ఉండ కూడదు
తోకాడించాలి
డాలర్ల దాదా గిరికి
గంగిరెద్దుల తలలాడించాలి...

ఏ దేశ రక్షణ
ఆ దేశ అస్త్ర శస్త్ర సైనిక పాటవం
తను పచ్చగ బతకాలి
అన్నీ దేశాలను మిత్రులనుకోవాలి
రాజ కాంక్ష ...రాక్షస కాంక్ష
ఆక్రమణ చేయడం
ఆణు భూతం చూపడం
కూటమి దేశాలు చీమలే
నియంత సర్పం
తనకు తాను చావు తెచ్చుకోవడం...

ఆరాచక రాజ్యాలు
సూర్యుడు అస్తమించని రాజ్యం
ప్రపంచ నియంత హిట్లర్
ఎవ్వరైన కానిండు
ప్రజాస్వామ్య వాంఛ ముందు మొకరిల్లినవే...
ఎన్ని విన్నా మూర్ఖులు
ఎన్ని కన్న మూఢులు
మృత్యువు బాటను ఎన్ను కుంటారు
ఓ పీడకలగా మిగిలి పోతారు...
సప్తవర్ణ మిళితమైన స్వచ్ఛమైన నీటిదే
పూల పక్షులతో కళకళ లాడె తోటదే
మతాభిమానంతో దురభిమానం లేక
విశ్వకల్యాళ శోభితంతో సాగే విశ్వందే
విజయం శాంతి కపోతనిదే...
ఈ ప్రపంచం
ఈ ప్రపంచం

**- రేడియమ్**
9291527757

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# అంతరిక్షంలో సరికొత్త అడుగు... ఆక్సియమ్ మిషన్ 4



అంతరిక్ష యానం అంటే మనకు అంతులేని ఆసక్తి కదూ? ఇప్పు డు, మనదేశం ఈ అంతరిక్ష రంగంలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించబోతోంది. ఇది కేవలం ఒక ప్రయోగం కాదు, ఒక కల, ఒక సాహసం. ఆక్సియమ్ మిషన్ 4 (ఎఎక్స్-4)పేరుతో జరగనున్న ఈ మిషన్, అంతర్జాతీయ అంత రిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)వైపు సాగే నాలుగో ప్రైవేట్ వ్యోమగాము ల ప్రయాణం. ఇది వాణిజ్యపరమైన ముందడుగు మాత్రమే కాదు, ప్రపంచ దేశాల సహకారం, విజ్ఞాన పరిశోధనలు, మానవ సహిత అంతరిక్ష ప్రయాణాల భవిష్యత్తుకు భారతదేశం వేస్తున్న ఓ ధైర్యమైన అడుగు. ఆక్సియమ్ స్పేస్, స్పేస్ఎక్స్, నాసాల భాగ స్వామ్యంతో జరుగుతున్న ఈ మిషన్, ప్రైవేట్ అంతరిక్ష ప్రయా ణాలు సాధారణ ప్రజలకు కూడా అంతరిక్షాన్ని చేరువ చేస్తున్నా యని,కొత్త శకంలో భారతదేశం ఎలా తనదైన ముద్ర వేస్తుందో మనకు తెలియజేస్తుంది. ఈ ప్రయోగ వేదికకు ఓ సుదీర్ఘ చరిత్ర ఉంది తెలుసా? ఒకప్పుడు అపోలో మిషన్లను, స్పేస్ షటిల్ విమానాలను ఇక్కడి నుంచే పంపారు. ఇప్పుడు, అదే వేదికపై స్పేస్ఎక్స్ ఫాల్కన్ 9 రాక్చె క్రూ డ్రాగన్ సి213 వ్యోమనౌక మానవ సహిత అంతరిక్ష ప్రయాణంలో తదుపరి చరిత్రకు నాంది పలుకుతుంది.



ఈ ఎఎక్స్-4 మిషన్లో నలుగురు వ్యోమ గాములుంటారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన వారు. వారిలో ఒకరు మన భారతీయ వ్యోమగామి కావడం మనకు గర్వకారణం. మిషన్కు నాయకత్వం వహిస్తున్నది పెగ్గీ విట్సన్. ఆమె నాసా మాజీ వ్యోమగామి, అంతరిక్షంలో అత్యంత అనుభవం ఉన్న అమెరికన్. కానీ మనందరి దృష్టి గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా పైనే. భారత వైమానిక దళానికి చెందిన ఈ విశిష్ట అధికారిని, ఇస్రో వారి మానవ సహిత అంతరిక్ష కార్యక్రమం గగన్యాన్లో భాగంగా వ్యోమగామిగా ఎంపిక చేశారు. మీకు తెలుసా? ఆయన ఐఎస్ఎస్ ని సందర్శించే మొదటి భారతీయుడు కానున్నారు. 1984లో రాకేష్ శర్మ చారిత్రక ప్రయాణం తర్వాత అంతరిక్షం లోకి వెళ్లే రెండో భారతీయ జాతీయుడు కూడా ఈయనే. శుక్లా ప్రయాణం కేవలం ఓ గౌరవం మాత్రమే కాదు. వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైనది. ఇది అంతరిక్షంలో వ్యోమగాములు ఎలా పనిచేయాలి, ఆరోగ్య పర్యవేక్షణ సుదీర్ఘ మిషన్ల కోసం ఎలాంటి ప్రోటోకాల్స్ పాటించాలి అనే విషయాలపై మనకు విలువైన అనుభవాన్ని అందిస్తుంది. భవిష్యత్లో ఇస్రో చేపట్టబోయే స్వదేశీ మిషన్లకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాగే, ప్రపంచ అంతరిక్ష రంగంలో మన స్థానాన్ని మరింత బట్టిష్టంగా మారుస్తుంది.

ఈ మిషన్లో శుక్లాతో పాటు హంగేరీకి చెందిన టిబోర్ కాపు, పోలాండ్కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కి-విస్నివ్స్కి కూడా ఉన్నారు. టిబోర్ కాపు 1980ల తర్వాత హంగేరీ నుండి అంతరిక్షంలోకి వెళ్తున్న మొదటి ప్రభుత్వ మద్దతు గల వ్యోమగామి కాగా, స్లావోస్జ్ ఉజ్నాన్స్కి-విస్నివ్స్కి దాదాపు ఐదు దశాబ్దాలలో అంతరిక్షంలోకి వెళ్ళిన మొదటి పోలిష్ జాతీయుడు.

ఎఎక్స్-4 మిషన్ కేవలం వ్యోమగాములను పంపడం మాత్రమే కాదు. ఇది ఓ తేలియాడే ప్రయోగశాల లాంటిది! 60కి పైగా శాస్త్రీయ ప్రయోగాలు, సాంకేతిక ప్రదర్శనలు ఇక్కడ జరుగుతాయి. మానవ ఆరోగ్యం, జీవశాస్త్రం, పదార్థాల పరిశోధన, భూమి పర్యవేక్షణ, అంతరిక్షంలోనే వస్తువులను తయారు చేయడం వంటి అనేక రకాల ప్రయోగాలు ఇందులో ఉన్నాయి.

ఇక భారతదేశం తరపున మన శుభాన్షు శుక్లా చేసే కృషి చాలా ప్రత్యేకమైనది. ఆయన అంతరిక్షంలో పోషకాహార ప్రయోగాలు నిర్వ హిస్తారు. ఈ ప్రయోగాలను ఇస్రో, బయో టెక్నా లజీ విభాగం కలిసి నాసాతో భాగస్వామ్యం చేసుకుని అభివృద్ధి చేశాయి. ఏంటంటే, సూక్ష్మ గురుత్వాకర్షణలో మన భారతీయ ఆహార పదార్థాలైన మెంతి (ఫెనుగ్రీక్), మూంగ్ (పెసలు) వంటివి మొలకెత్తగలవా? అని పరీక్షిస్తారు. ఇది విజయ వంతమైతే చంద్రుడు, అంగారకుడు, ఇంకా సుదూర అంతరిక్ష మిషన్ల కోసం మనం అంతరిక్షంలోనే ఆహారాన్ని పండించుకోవచ్చు. ఎంత అద్భుతం కదూ?

అంతేకాదు! శుక్లా నాసా చేసే ఐదు మానవ పరిశోధనా అధ్యయనాలలో కూడా పాల్గొంటారు. కండరాల నష్టం, మృదులాస్థి క్షీణత, జ్ఞాపకశక్తి మార్పులు, రోగనిరోధక వ్యవస్థ అనుకరణ, మెదడు రక్త ప్రవాహానికి సంబంధించిన విషయాలు ఇందులో ఉన్నాయి. ఇవన్నీ సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణం మానవ శరీరంపై ఎలాంటి ప్రభావాలు చూపుతుందో తెలుసుకోవడానికి చాలా కీలకం.

### మానవ పరిశోధనలు

అంతరిక్షంలో కంప్యూటర్ స్క్రీన్లు చూస్తే ఎలాంటి ప్రభావాలు ఉంటాయి, మెదడు పనితీరు, రక్త ప్రవాహం, కీళ్ళు, కండరాలు ఎలా ప్రభావితమవుతాయి, జీర్ణవ్యవస్థలో మైక్రో బయోమ్లు ఎలా మారుతాయి, కండరాలు క్షీణించ కుండా నివారించడానికి ఎలక్ట్రికల్ స్టిమ్యులేషన్ ఎలా పనిచేస్తుంది వంటివి పరిశీలిస్తారు.

### జీవశాస్త్ర పరిశోధనలు:

చిన్నపాటి శైవలాలు, బ్యాక్టీరియా మరియు పండుగల పెరుగుదల, రేడియేషన్ నిరోధకత, జన్యుశాస్త్రంపై దృష్టి సారించి అధ్యయనాలు చేస్తారు. స్టెమ్ సెల్స్ వృద్ధాప్యం, క్యాన్సర్ అభివృద్ధి, అంతరిక్షంలోనే 'ఆన్-చిప్' ద్వారా ఔషధ పరీక్షలు వంటివి కూడా జరుగుతాయి.

### అంతరిక్షంలో వ్యవసాయం

మొక్కలు ఎలా మొలకెత్తుతాయి, మైక్రోగ్రీన్లు ఎలా పెరుగుతాయి వంటివి చూస్తారు.భవిష్యత్‌లో అంతరిక్షంలోనే మనం ఆహారాన్ని పండించుకునే వ్యవస్థలకు ఇది నాంది పలుకుతుంది.

### పదార్థ విజ్ఞానం భూమి పర్యవేక్షణ

స్పేస్ సూట్లలో వేడి ఎలా వెదజల్లబడుతుంది, కొత్త తరం పదార్థాలను పరీక్షించడం, పర్యావరణ పర్యవేక్షణ కోసం భూమిని పరిశీలించడం వంటివి జరుగుతాయి. ఈ ప్రయోగాలన్నీ భవిష్యత్‌లో మనం అంతరిక్షంలో స్థిరంగా జీవించడానికి, భూమికి అతీతమైన జీవశాస్త్రంపై మన అవగాహనను పెంచడానికి ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తాయి.

### మిషన్ తర్వాత వాణిజ్య అంతరిక్ష భవిష్యత్తు

ఎఎక్స్-4 అనేది కేవలం ఒక మిషన్ మాత్రమే కాదు. ఇది ఆక్సియమ్ స్పేస్ పెద్ద ప్రణాళికలో భాగం. ఈ దశాబ్దం చివరి నాటికి ఐఎస్ఎస్ స్థానంలో ప్రపంచంలోని మొట్టమొదటి వాణిజ్య అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించడమే వారి లక్ష్యం. ప్రైవేటు సంస్థలు, వివిధ దేశాల ప్రభుత్వాలు, అంతర్జాతీయ ఏజెన్సీలు కలిసి అంతరిక్షంలో ఎలా సహకరించుకోవచ్చో ఈ మిషన్ చూపిస్తుంది. మన భారతదేశానికి,ఈమిషన్ ఒక వ్యూహాత్మక మలుపు. ఇది అంతరిక్ష రంగంలో ప్రభుత్వం మాత్రమే కాకుండా,ప్రైవేట్ సంస్థలు కూడా చురుగ్గా పాల్గొంటాయని సంకేతం. ఇది భారత దేశాన్ని ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో మరింత లోతుగా భాగం చేస్తుంది. భవిష్యత్‌లో ఇస్రో చేపట్టబోయే మానవ సహిత అంతరిక్ష ప్రయా ణాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ఇది మరింత విశ్వసనీయతను, నమ్మకాన్ని పెంచుతుంది.

### అంతరిక్షంలో భారతదేశపు మెరుపులు

ఆక్సియమ్ మిషన్ 4 కేవలం వాణిజ్య అంతరిక్ష ప్రయాణానికి మాత్రమే కాకుండా, ఒక ప్రముఖ అంతరిక్ష శక్తిగా భారతదేశం ఎదుగుదలకు కూడా ఒక మైలురాయి. గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అంతరిక్షంలోకి వెళ్ళడంతో, భారతదేశం ఇక కేవలం చూసేది మాత్రమే కాదు- అంతరిక్ష పరిశోధన భవిష్యత్తును రూపొందిం చడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ మిషన్ ఒక ధైర్యమైన కలను నొక్కి చెబుతుంది. విజ్ఞానం, దౌత్యం, ఆవిష్కరణలను అంతరిక్షంలో మిళితం చేస్తూ, మానవజాతిని భూమికి అతీతంగానడిపించడంలో భారతదేశం కీలకం అవుతుంది.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

# శరణార్థుల పట్ల సంఘీభావం తెలుపలేమా !



యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు, పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయ సంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరే వారు, ఆశ్రయం పొందే వారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందిన వారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరి వారందరూ శరణార్థుల జాబితాలో వస్తారు.

శరణార్థులు,వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 20 జూన్ రోజున ప్రపంచ శరణార్థి దినం (వరల్ రెఫ్యూజీ డే)ను 2001 నుంచి పాటిస్తున్నారు. మరో దేశం నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చిన శరణార్థులు కూడా సాధారణ మానవులే అని, వారికి కూడా కనీస మానవ హక్కులు వర్తిస్తాయని, వారితో ధైర్యాన్ని నింపడం, వారి పిల్లలకు విద్య వసతులు విస్తరించాలని, ఆకలి చావుల కోరల్లో చిక్కకుండా చూసుకోవాలని ప్రపంచ దేశాలకు అవగాహన పరచడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2025 ప్రపంచ శరణార్థి దినం ఇతివృత్తంగా శరణార్థులకు సంఘీభావం ఉందాం అనే అంశాన్ని నిర్ణయించారు. 2025 శరణార్థి వారం ఇతివృత్తంగా సూపర్ పవర్‌గా పౌర సమాజం అనే అంశాన్ని తీసుకున్నారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువు లుగా భావించవద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీస మానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం,వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి నిత్యం కొనసాగాలి.



భారత్‌లోకి శ్రీలంక, మయాన్మార్, అఫ్ఘనిస్థాన్, టిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేల మంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొన సాగుతున్నది. శ్రీలంకన్ తమిళులు, రోహింగ్యాలు, టిబెటన్లు, చక్మా-హజోంగ్‌లు, జూయిష్ వర్గాలు అధిక సంఖ్యలో భారత్‌కు రావడం, శరణార్థులుగా జీవితాలను కొనసాగించుకోవడం జరుగుతూ కొన్ని సార్లు మన దేశంలో శాంతి భద్రతల సమస్య లకు కూడా కారణం అవుతున్నారని కూడా భావించడంతో జరుగుతోంది. 2022 వివరాల ప్రకారం భారత్‌లో 46,000 మంది, అందులో 22,509 మంది రోహింగ్యాలు కూడా శరణార్థులు నమోదు అయినట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. భారత్‌లో చేరిన శరణార్థులు అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడి అసంఘటిత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. శరణార్థి కుటుంబాలకు చెందిన పిల్లలు 7 శాతం మాత్రమే విద్య కొనసాగిస్తున్నారని, 87 శాతం శరణార్థులు అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే జీవిస్తున్నారని తెలుసుకోవాలి.

ప్రపంచ శరణార్థి దినం వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం నిరంతరం జరగాలి. నిస్సహాయ స్థితుల్లో శరణార్థులుగా చేరిన వారి కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చడం, సహానుభూతితో వారికి గొడుగు పట్టడం, వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు కల్పించడం, మానవీయ కోణంలో అక్కున చేర్చుకోవడం, వారికి వైద్య ఆరోగ్య వసతులు కల్పించం, వారిని మానవులుగా గౌరవించడం, సమానత్వ భావనలను ఆచరించడం, కనీస సహకారాలను అందించడం కొనసాగాలి. ఊహించని సందర్భాల్లో పరాయి దేశంలోకి చేరిన శరణార్థులకు మానవ హక్కుల గొడుగు పడదాం, వారి శ్రేయస్సుకు పాటు పడదాం.

**(20 జూన్ ప్రపంచ శరణార్థి దినం)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ఆదివాసుల కళాఖండాల శ్రమను వృధా చేస్తారా..!



భారతీయ సంస్కృతిలో చారిత్రక సాంస్కృతిక మూలాల ప్రాముఖ్యత ఎంతో ఉంది. ప్రజల సాంస్కృతిక అభిరుచులు వాటిని సృష్టించే విజ్ఞానం, సృజనాత్మకతకి అద్దంపట్టే ప్రజా సంస్కృతికి వ్యతిరేకులుగా ముద్ర పడదలుచుకున్నారా?

నిజానికి మూలాలను మరిచిన సమాజం భవిష్యత్తును కోల్పోతుంది. ఒక జాతి తన మూలాలను విస్మరించినప్పుడు, అది సాంస్కృతికంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. పరదేశీయుల పాలనలో భారతీయ మూలాలను హేళన చేశారు. కానీ స్వాతంత్ర్యం తర్వాత తిరిగి అవి ప్రాధాన్యం పొందాయి. మాతృభాష, మాతృభూమి, మాతృసంస్కృతి ఋూఈ మూడు మూలాలను గౌరవించడమే భారతీయ సంస్కృతి. నిజమైన మూల ఆరాధన. కాబట్టి ఆద్య కళ వస్తు సేకరణను నేటి యువతకు పరిచయం చేయాలి. గతం వర్తమానం వేరు వేరు కాదు. అదొక ప్రవాహం. అనేక నదుల సంఘం, సమన్వయ మార్గం. ప్రస్తుత కాలంలో యువత ఆధునికత వైపు పరుగులు పెడుతూ మూలాలను మరచిపోతున్నది. కానీ ఆధునికత అంటే మూలాలను తుడిచి వేసేయడం కాదు. అసలు భారతీయ తత్వమే 'నవీనతలో పౌరాణికత, పౌరాణికతలో నవీనత'అనే సమన్వయాన్ని నేర్పుతుంది. 'మూలాలను విస్మరించిన వృక్షం పతనమవుతుంది' అన్న చైనీస్ నానుడి మనకీ వర్తిస్తుంది.

'నాటి మూలాలే నేటికీ ఆదర్శాలు - ఆదివాసి, జానపద, ప్రాదేశిక సంస్కృతిని కాపాడ డానికి తిరుమలరావు గారి కి గుర్తింపు ఇవ్వాలి! వారు సేకరించిన ఆద్య కళ ఐదు మ్యూజియంలను ప్రోత్సహించాలి. తెలంగాణ రాష్ట్రం అనేక గొప్ప వారసత్వ సంపదలను, ప్రజల జ్ఞాపకాలనే కాదు, వారి జీవన విధానాలనూ, సాంస్కృతిక వైవిధ్యాన్నీ తనలోని ఆదివాసి తెగల ద్వారా అక్కున చేర్చుకుంది. ఈ తెగల సంస్కృతి అనేది కేవలం ప్రాచీన జీవనశైలికే పరిమితం కాకుండా, ప్రకృతితో సమతుల్యత, సామాజిక సమానత్వం, సుస్థిర జీవన ధోరణులకు ప్రతీకగా నిలుస్తోంది. అయితే ఈ విలువలు నశించిపోతున్న వేళ, వాటిని నిలిపేందుకు పోరాటం చేసినవారిలో ప్రొఫెసర్ తిరుమలరావు కృషి ప్రశంసనీయం.

తిరుమలరావు తన జీవితాన్ని గిరిజనుల సాధికారత కోసం అంకితమిచ్చారు. ఆయన అనేక ఆదివాసి సమాజాలు ఎదుర్కొంటున్న సమస్యల చూసినవారు. సాంస్కృతిక పరిరక్షణకు తోడుగా, ఆయన విద్యాభివృద్ధి, హక్కులపై అవగాహన, భాషా పరిరక్షణ వంటి అంశాల్లో ఉద్యమాలు నిర్వహించారు. ఆయన గిరిజన భాషలపై పరిశోధనలు చేశారు, తండాలలో పాఠశాలలు ఏర్పరచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు స్థానిక వన్య సంపద ఆధారిత స్వయం ఉపాధి పథకాలను ప్రవేశపెట్టే ప్రయత్నం చేశారు. ఆదివాసుల పండుగలు, దేవతలు, చరిత్రను డాక్యుమెంట్ చేసి భవిష్యత్ తరాల కోసం భద్రపరిచే కృషి చేశారు. తిరుమలరావు వ్యక్తిగతంగా ఏమి ఆశించకపోయినా, ఆయన సేవలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం అనేది ఆదివాసీ ప్రజల పట్ల గౌరవ సూచిక అవుతుంది. అలాంటి వ్యక్తుల సేవలను గుర్తించి వారిని పురస్కారాలతో సత్కరించడం వల్ల ఇతరులు కూడా ప్రేరణ పొందుతారు. ఈ రోజుల్లో కేవలం రాజకీయంగా లబ్ధి పొందేలా ఆదివాసీ హక్కులను ప్రస్తావించటం జరుగుతోంది. కానీ నిజంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించే నాయకత్వం అత్యంత అవసరం. తిరుమలరావు వంటి వ్యక్తుల జీవితాన్ని విద్యాసంస్థల్లో ఒక అధ్యయనంగా తీర్చిదిద్దితే మాత్రమే క్షేత్ర పర్యటనలతో, పరిశోధనలతో, అధ్యయనాలతో రాబోయే తరం ఇలాంటి వారసత్వాన్ని కాపాడుకో గలదు.

ఆద్య కళ మ్యూజియంలో భద్రపరచబడిన చరిత్ర మనకు మార్గదర్శనంగా భావించవలసి ఉంటుంది. ప్రొఫెసర్ జయదీర్ తిరుమలరావు తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండ పట్టణంలో జన్మించారు. అక్కడే ఉన్నత విద్య అభ్యసించారు. ఆయనకు, భారతీయ చరిత్ర, ఆదివాసి జీవన విధానాలు, ప్రజల మౌలిక జీవన తత్వాలపై ప్రత్యేక ఆసక్తి. గ్రామీణ జీవితం, పాత వస్తువుల పట్ల ఆయనకున్న మమకారం చిన్ననాటి నుంచే స్పష్టమైంది. జీవనోపాధి కోసం ఆయన ప్రొఫెసర్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగించినా, సంపదగా భావించినది మాత్రం నాటి వాడుకలో గల పరికరాలే, వస్తువులే. సంగీత వాద్యాలే. ఈ కళాఖండాల ద్వారా, సేకరించిన అనేక వస్తువుల సహకారంతో ఆధారాలతో భవిష్యత్తుని నిర్మించడం, ఇతర పరిశోధకులకు వాటిని అందించడం, ఆ రంగంలో విదేశాలతో పోటీగా పరిశోధన అధ్యయనాన్ని పెంచడం తన బాధ్యతగా భావిస్తున్నారు. ఈ వస్తువుల్లో కొన్ని భారతదేశ స్వాతంత్ర్యం ముందు నాటి నుండి వాడుకలో ఉన్నవిగా గుర్తించబడ్డాయి. ఆచార వ్యవహారాల్ని ప్రతిబింబించే వీటి ప్రత్యేకత మన ఊరి సంస్కృతి, మన చుట్టూ నివసించిన మానవ సంస్కృతి నాగరికత. సామాన్య ప్రజల అసామాన్య జీవనవిధానాన్ని తెలిసికొనాలనుకునే ప్రతీ కొత్త తరం విద్యార్థికి ఒక అమూల్య సంపద.

### తన ఇల్లే ఒక మ్యూజియం:

ఈ సంపదను భద్రపరచాలనే తపనతో, తిరుమలరావు తన ఇంటిని ఒక చిన్న మ్యూజియంలా మార్చారు. సొంత ఖర్చుతో, ఎలాంటి ప్రభుత్వ సహాయం లేకుండానే, తలుపు తీసిన ప్రతీసారీ ఒక చరిత్రపు పుట తడుముకునేలా ఆయన ఆ ఇంటిని రూపొందించారు. చెత్తగా భావించిన పాత వస్తువుల్లో చరిత్రను చూసిన దృష్టి ఆయనది. ఆయన మ్యూజియంలో పాఠశాల విద్యార్థులు, పరిశోధకులు,



చరిత్రాభిమానులు తరచూ వస్తూ ఉంటారు. ప్రతి వస్తువు వెనక కథను ఆయన స్వయంగా వివరించి చెప్పేలా తీర్చిదిద్దారు. ఇది ఒక రోజు పని కాదు, ఒక సంవత్సరం కృషి కాదు. 50 సంవత్సరాలకు పైగా ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు నిబద్ధతతో ఉన్నారు. జీతం సొమ్ము పొదుపు చేసి, తిరిగి చరిత్రకే వెచ్చించిన ఆయన జీవితంలో మౌలిక అవసరాలకంటే మౌలిక చరిత్రే ముఖ్యం అయింది. ప్రజల సంస్కృతి ఆయనకు తరగని గని అయ్యింది.

గత ప్రభుత్వం పెద్దగా గుర్తింపు ఇవ్వకపోయినా, ప్రజల ఆదరణ ఆయనకు అండగా నిలిచింది. ఆయన సేకరణలపై డాక్యుమెంటరీలు వచ్చాయి, బహుమతులు లభించాయి, కానీ ఆయన కృషికి సరైన గౌరవం మాత్రం దొరక లేదనేది వాస్తవం. తిరుమలరావు గారి జీవితం మనకు ఒక అద్దం లాంటిది. ఆ అద్దంలో మనకి మనం చూసుకుంటే మనం ఎంత చిన్న వాళ్ళమో తెలిసిపోతుంది. ప్రజల పట్ల చెరగని గౌరవం, అభిమానం ఉంటే ఏమేం సాధించగలమో చూపించే ప్రేరణ ఆయన జీవితం. చరిత్ర పట్ల, సంస్కృతి పట్ల గౌరవం కలిగి ఉండే ప్రతీ వ్యక్తికి ఆయన ప్రేరణాత్మక జీవనగాథ. నిజంగా, ఆయన మ్యూజియం కేవలం వస్తువుల ప్రదర్శన కాదు - అది మన మూలాల పట్ల కృతజ్ఞత వ్యక్తీకరణ.

అవగాహన లేని కొందరు విద్యార్థులు, ఆదివాసీ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి ఆదివాసి సాంస్కృతిక వ్యతిరేకులతో కలసి ఆద్య కళ కోసం రిపేరు చేస్తున్న భవనాలపై దాడులు చేయడం బాధాకరం. బహుజన చరిత్రను చెరిపేయాలన్న కుట్రలలో భాగంగా దీనిని చూడాలి. బహుజన చరిత్ర అనేది శ్రమజీవుల జీవన సౌందర్యానికి ప్రతిరూపం. ఇది సామాజిక న్యాయ పథానికి మార్గదర్శి. అయితే ఇటీవలి కాలంలో ఈ చరిత్రపై దాడులు జరుగుతుండటం అత్యంత ఆందోళన కలిగించే విషయం. ఈ దాడులు కేవలం భౌతిక ఆస్తులపై మాత్రమే కాక, ప్రజల చైతన్యంపై, వారికొరకు న్యాయం కోసం పోరాడిన మహనీయుల మౌలిక గుర్తింపుపై జరుగుతున్న మానసిక దాడులుగా పరిగణించాలి.

బహుజన చరిత్రను విశ్లేషించే వేదికగా ఏర్పాటవుతున్న మ్యూజియంపై జరిగిన దాడి అనేది యాదృచ్ఛికం కాదు. ఇది చరిత్రను చెరిపేయాలన్న శక్తుల కుట్రలో ఒక భాగం. ఇందులో ఉన్న పుస్తకాలు, అరుదైన ఫోటోలు, ఉద్యమ చరిత్రకు సంబంధించి కలిపిన డాక్యుమెంట్లు కాపాడుకోవాలి. ఆద్య కళ మ్యూజియం పై జరిగిన దాడి మౌలిక హక్కుల ఉల్లంఘన మాత్రమే కాదు, ప్రజల సాంస్కృతిక హక్కులపై, గుర్తింపుపై జరిగిన హేయమైన దాడి. భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి తన అభిప్రాయాన్ని వెలిబుచ్చే హక్కు, తాను నమ్మిన భావజాలాన్ని ఆచరించుకునే స్వేచ్ఛ ఉంది. చరిత్రను గౌరవించడం, దానిని భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పం కూడా అదే స్వేచ్ఛలో భాగం. అయితే ఆ మ్యూజియంపై జరిగిన దాడి ద్వారా ఈ హక్కులన్నిటి పై దాడిగానే చెప్పుకోవాలి. ఇది ఒక దురదృష్టకర ఘట్టంగా మిగిలింది. ఆద్యకళ మ్యూజియంపై జరిగిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలి. ఇది కేవలం ఎవరైనా వ్యక్తిగత దాడి కాదు. ఈ దేశంలో అట్టడుగు వర్గాల ప్రజల సంస్కృతిపై, చరిత్రపై, సృజనాత్మకతపై జరిగిన దాడి - ఇది న్యాయ, రాజ్యాంగ, చరిత్ర, సంస్కృతి రంగాలన్నింటిపై జరిగిన దాడి. అందుకే ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. అందుకే ఇటువంటి ప్రయత్నాలను అడ్డుకునేందుకు కుట్రలు, దాడులు చేస్తూ ప్రజల పాత్రని చెరిపేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. చారిత్రికంగా ఎప్పటికీ బహుజనులే ఈ దేశాన్ని నిర్మించారు. కానీ ప్రజా వ్యతిరేకుల వ్యూహం వారి చరిత్రను ఎప్పటికీ అంధకారంలో ఉంచేలా చేస్తుందనడానికి ఇలాంటి దాడులే చేస్తారని ఉదాహరణ గా చెప్పుకోవచ్చు.

తిరుమలరావు గారు గత 5 దశాబ్దాలుగా శ్రమజీవుల చరిత్రను, బహుజన ఉద్యమాల పునాది వ్యక్తుల జీవితాలను డాక్యుమెంట్ చేస్తూ, వాటిని ప్రజల దృష్టికి తీసుకురావడంలో నిరంతర కృషి చేశారు. ఆయన చేసిన ఈ సేవకు గౌరవంగా, ప్రభుత్వమే ఆయన పేరిట మ్యూజియాన్ని నిర్మించి గుర్తింపు ఇవ్వడం అత్యవసరం. భవిష్యత్ తరాలకు చరిత్రను అందించాలంటే, బహుజన చరిత్రను సమగ్రంగా భవిష్యత్ తరాలకు అందించాలంటే వ్యక్తిగతంగా, స్వచ్ఛందంగా నడుస్తున్న ప్రదర్శనలు సరిపోవు. దీనికోసం హైదరాబాద్ నగరంలో ఐదు ఎకరాల భూమిని కేటాయించాలి. ప్రతి ఏటా రెండు మూడు కోట్ల బడ్జెట్ మ్యూజియం భవనాలు శాశ్వత రాతిపదికన నిర్మాణం చేపట్టాలి. దీనిని తిరుమలరావు పేరిట స్థాపించి, ఆయనే సేకరించిన పత్రాలు, అనేక కళాఖండాలు, ప్రదర్శనలు ఆ మ్యూజియంలో ఉంచాలి. నిర్వహణ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి.

తిరుమలరావు గారు నిస్వార్థంగా తాను సంపాదించిన మొత్తాన్ని ఈ చరిత్ర కోసం ఖర్చుచేస్తూ, గ్రామా గ్రామాన తిరుగుతూ సమాచారాన్ని సేకరించారు. అలాంటి కృషికి నిజమైన గౌరవం ప్రభుత్వ గుర్తింపు ద్వారా రావాలి. మ్యూజియం ద్వారా బహుజన యువతలో చైతన్యం పునఃస్థాపన అవుతుంది. వారిలో స్ఫూర్తి కలుగుతుంది. మన చరిత్రను మనమే వ్రాసుకునే వీలు కలుగుతుంది. వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలి, ఎందుకంటే ఆయన నల్లమల అచ్చంపేట నుంచి వచ్చిన వ్యక్తిగా ఆదివాసుల జీవన పరిణామాలు తెలిసిన వ్యక్తిగా ఆదివాసుల కొరకై ముందుండే నాయకులు. ముఖ్యమంత్రి ప్రజల ఆకాంక్షల మేరకు సంస్కృతి పరిరక్షణ చేయాలి.

తెలంగాణకు ప్రజాస్వామ్య భావాలు కలిగిన నాయకుడిగా ఆయనకు మంచి పేరుంది. ఆయన నిజంగా ప్రజాపక్ష నేతగా నిలవాలంటే ఈ దాడిపై స్పందించాలి. తిరుమలరావు చేసిన కృషిని గుర్తించి మ్యూజియాన్ని నిర్మించే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే చేపడుతుందని ప్రకటన చేయాలి. ఇది బహుజనుల మనోభావాలను గౌరవించే చర్య అవుతుంది. చరిత్ర అనేది భవిష్యత్తు నిర్మాణానికి బలమైన పునాది. ఆ చరిత్రను చెరిపేయాలనే కుట్రలను అరికట్టాలంటే ప్రభుత్వమే ముందుకు రావాలి. తిరుమలరావు వంటి ప్రజా చరిత్రకారులకు గౌరవం ఇవ్వాలంటే మ్యూజియం నిర్మాణమే సరైన మార్గం. ఇది బహుజనుల గౌరవానికి, వారిపట్ల న్యాయానికి ప్రతీకగా నిలుస్తుంది.

**- మన్నారం నాగరాజు**
95508 44433

## బీజేపీ ఎమ్మెల్యేపై, గుడిసె క్రిష్ణమ్మపై
# అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



**కర్నూలు, జూన్ 19(మనం న్యూస్):** ఆదోని బిజెపి ఎమ్మెల్యే పై, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మపై వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధాకర్ బాబు మాట్లాడుతూ ఆదోని మండలం ధనాపురం గ్రామంలో జరిగిన కూటమి ప్రభుత్వం సంవత్సర పాలన సంబరాలు జరుపుకుంటూ గుడి దగ్గర జరిగిన సభలో దళితుడైన సర్పంచ్ చంద్రశేఖర్ ను అవమానించడం బాధాకరమన్నారు. సర్పంచ్ చంద్రశేఖర్ వేదిక దగ్గరికి వచ్చిన వేదికపైకి పిలవకుండా క్రింద నిలబెట్టి మాట్లాడటం దళిత జాతికి అవమానకరమని ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు, రాజ్యాంగ హక్కులను గౌరవించి సాటి మనిషిని మనిషిగా చూడటం నేర్చుకోవాలని హితవు పలికారు. ఒకపక్క మమ్ములను ఎస్టీ జాబితాలో చేర్చాలని అడుగుతూ ఎస్సీలను అవమాన పరచడం ఎంతవరకు సమంజసం అని సుధాకర్ బాబు ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ , ఎస్పీ మంచి పరిపాలన అందిస్తున్నారని మంచి పేరు ఉందని ఆదోని ఎమ్మెల్యే పైన, గుడిసె కృష్ణమ్మ పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఈ కేసును సుమోటోగా తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని సుధాకర్ బాబు తెలియజేశారు. అనంతరం మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు మాట్లాడుతూ చంద్రశేఖర్ ని స్టేజి మీదకు పిలవకుండా అవమానపరిచినందుకు ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పై, గుడిసే కృష్ణమ్మ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని తెలియజేశారు. అనంతరం జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఎన్సి బజారన్న మాట్లాడుతూ దళిత సర్పంచ్ చంద్రశేఖర్ ను అవమానించడం దళిత జాతికి అవమానమని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చిత్తూరు జిల్లాలో దళిత మహిళను చెట్టుకు కట్టి కొట్టడం జరిగిందని దళితులపై దాడులు ఎక్కువయ్యాయని, ఆదోని ఎమ్మెల్యే పై గుడిసె కృష్ణమ్మ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని త్వరలో జిల్లా కలెక్టర్ ని, జిల్లా ఎస్పీ ని కలిసి వినతి పత్రం సమర్పిస్తామని తెలియజేశారు. అనంతరం కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ దళిత సర్పంచ్ చంద్రశేఖర్ స్టేజి మీదకి పిలవకుండా కిందనే నిలుచోబెట్టి ఎస్సీ అని సంబోధించి అవమానపరచడం దళిత జాతికి అవమానమని వెంటనే వారి పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ ఎన్సి బజారన్న, కోడుమూరు కోఆర్డినేటర్ అనంత రత్నం మాదిగ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కేకేసి చైర్మన్ ఎజాస్ అహ్మద్, జిల్లా మహిళా కాంగ్రెస్ ఎస్ ప్రమీల కాంగ్రెస్ నాయకులు సయ్యద్ నవీద్, ఎండ్లురు లాజరస్, అబ్దుల్ హై, ఐఎన్టియుసి రేపల్లె ప్రతాప్, జాన్ సదానందం కిషోర్ మొదలగు వారు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ నేతలపై
# ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి




**కౌతాళం జూన్ 19 మనం న్యూస్:** కౌతాళం మండల కేంద్రం నందు కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆదోని మండలం దాణాపురం గ్రామమునందు దళిత సర్పంచును వేదికపై రానీయకుండా ఎస్సీ మాదిగ నీవు కింద ఉండమ ని అవమానించిన డాక్టర్ పార్థసారథిని ,మహిళా సంఘం నాయకురాలు గుడిసె కృష్ణమ్మ పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని అంబేద్కర్ సర్కిల్ నందు పెద్ద ఎత్తున దళితులు, నినాదాలతో రాస్తారోకో చేయడమైనది. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు చిన్న మారయ్య, వీరేష్ ,దళిత సంఘం నాయకులు పాల్ దినకరన్ అవతారం, దేవదాస్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య ,మండల కార్యదర్శి బి. ఈరన్న సంయుక్తంగా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడి సంవత్సర సంబరాల కార్యక్రమంలో డానాపురం గ్రామం నందు సభలో ఆ గ్రామ సర్పంచులు దళితుడు అయినందున వేదికపై పిలువకపోగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతుండగా సర్పంచ్ వేదికపై రావాలని కోరగా, తెలుగుదేశం నాయకురాలు గుడిసె కృష్ణమ్మ గారు ఆయన మాదిగ కులానికి చెందిన వ్యక్తి అందుకు వేదికపై రాడు అని హుఖం జారీ చేస్తే ఎమ్మెల్యే పార్థసారథిగారు సరేలే కిందే ఉండు అని ఎమ్మెల్యే అనడం సరైనది కాదని వారు అన్నారు. ఒక గ్రామ ప్రథమ పౌరునికి అవమానిస్తూ ,కించపరిచే విధంగా పబ్లిక్ గా కులం పేరుతో తక్కువచేసి మాట్లాడటం ఎమ్మెల్యే గారికి గుడిసె కృష్ణమ్మ గారికి సరైనది కాదని అందుకు వీళ్ళిద్దరిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు అన్నారు. డానాపురం సర్పంచు కు వీళ్ళిద్దరూ బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు కోరారు .లేని పక్షమున కెవిపిఎస్ ఆధ్వర్యంలో మిగతా కుల సంఘాల అందర్నీ కలుపుకొని పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా చేయగలమని వారు హెచ్చరించినారు.
ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వీరేశ్, ఆదాం, తాయన్న, దళిత సంఘం నాయకులు ముఖేష్ ,వీరేష్ పెద్ద ఎత్తున మండలంలోని ప్రజలందరూ పాల్గొన్నారు.

## ఫ్యాక్షన్ గ్రామాలు పీకేట్లను పరిశీలించిన ఎస్డిపిఓ




**కౌతాళం జూన్ 19 మనం న్యూస్:** గురువారం ఎమ్మిగనూరు సబ్ డివిజనల్ ఆఫీసర్ ఎం ఉపేంద్ర బాబు మరియు కౌతాళం యుపిఎస్ ఇన్స్పెక్టర్ ఎన్ అశోక్ కుమార్,సిబ్బంది అందరూ కలిసి హాల్వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బాలబాలికలుకు చెడు అలవాట్ల, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలు గురించి మరియు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించి అలాగే విద్యార్థి దశ గురించి తెలిపి మరియు నదిచాగి,రౌడూరు ఫ్యాక్షన్ గ్రామాల పికెట్లను తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి...





**పత్తికొండ, జూన్ 19(మనం న్యూస్ ):** ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, తెదేపా నాయకురాలు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. గురుదాస్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి నాయకులు ఆదోని మండలం డానాపురం లో సంబరాలు జరుపుకుంటూ గ్రామ నడివీధిలో గుడి దగ్గర దళిత సర్పంచ్ అయిన చంద్రశేఖర్ ను ఎమ్మెల్యే సమక్షంలోనే కులం పేరుతో అవమానపరచడం సిగ్గుచేటు అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు అయినా నేటికీ కులం పేరుతో వివక్షత చూపడం సరైంది కాదన్నారు. గ్రామ ప్రథమ పౌరుడిని అవమానపరిచిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, తెదేపా నాయకురాలు గుడిసే కృష్ణమ్మ ల పై కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్ష ,కార్యదర్శులు హెచ్ రంగన్న, ఎన్ రామాంజనేయులు, నాయకులు రాజప్ప, పరశురాముడు,ఉచ్చన్న పాల్గొన్నారు.

# ఆర్డిటి సేవలను కొనసాగించాలి




**కౌతాళం జూన్ 19 మనం న్యూస్ :** కౌతాళం మండలంలో ఆర్డిటి సంస్థ చేస్తున్న సేవలను కొనసాగించాలని గురువారం అంబేద్కర్ సర్కిల్ నుండి తాహశీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి ఎమ్మార్వో రజనీకాంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వివిధ గ్రామాల , పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు, సిపిఐ, నాయకులు, ఏఐఎస్ఎఫ్, నాయకులు, సంపూర్ణ మద్దతు తెలియజేసి శాంతి యుత ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అభ్యున్నత సాధించాలని ఉద్దేశంతో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆర్ డి టి సంస్థ డాక్టర్ విన్సెంట్ ఫెర్రర్ ఒక లక్ష్యంతో ఏర్పాటు చేశారన్నారు. ఆర్డిటి సంస్థ ద్వారా ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ,సామాజిక వర్గాల ప్రజలకు,విద్యార్థులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, ఎనలేని సేవలు అందిస్తున్నటువంటి ఏకైక సంస్థ ఆర్డిటి సంస్థ అన్నారు. దాదాపు మంత్రాలయం నియోజకవ ర్గంలో 556 ఇల్లు నిర్మించారని అలాగే నాణ్యమైన విద్య వైద్యం ప్రతి విద్యార్థికి అందాలని 26 పాఠశాలలకు అడిషనల్ రూమ్స్ ఏర్పాటు చేశారన్నారు. అంతే కాకుండా కళాశాలలకు , పాఠశాలలకు ఆర్ఓ మిషనరీ డ్రింకింగ్ వాటర్ సప్లై ఏర్పాటు చేసి ,అలాగే ఆర్డిటి సెట్ ద్వారా 26 మంది విద్యార్థులకు అన్ని విధాలుగా ఫీజులు చెల్లిస్తోందన్నారు. వారిలో ముగ్గురు విద్యార్థులు ఎంబీబీఎస్ ,చదువుతున్నారని తెలిపారు. త్రాగు నీరు లేని గ్రామాల ప్రజలకు ప్రాజెక్టుల ద్వారా స్వచ్ఛందంగా పైప్ లైన్ ద్వారా ప్రజలకు త్రాగు నీరు అందించిన ఘనత ఆర్డిటి సంస్థదన్నారు. అలాంటి స్వచ్ఛంద సంస్థకు వస్తున్నటువంటి నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం బాధాకరమన్నారు. వెంటనే ఆర్డిటి సంస్థ ఎఫ్ సి ఆర్ ఏ రెన్యువల్ చేసి యథావిధిగా నిర్వహించాలని తెలపడం జరిగింది.

## నూతన తహశీల్దార్ ను కలిసిన వీఆర్ఏల సంఘం జిల్లా సెక్రటరీ...



**తుగ్గలి జూన్ 19(మనం న్యూస్ ):** తుగ్గలి మండల కేంద్రంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన మండల రెవెన్యూ అధికారి ఎస్.రవి,డిప్యూటీ తహశీల్దార్ ఎం. సుదర్శనం లును గురువారం వీఆర్ఏల సంఘం జిల్లా సెక్రటరీ శేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలువామాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు పాల్గొన్నారు.

## ఎఫ్ సి ఆర్ ఏ రిజిస్ట్రేషన్ ను రెన్యువల్ చేయాలి

### తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన సిపిఐ,సిపిఎం,వివిధ గ్రామాల ప్రజలు..




**తుగ్గలి, జూన్ 19(మనం న్యూస్):** రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ( ఆర్డిటీ ) అనేది దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని విన్సెంట్ ఫెర్రర్ 1969 సంవత్సరంలో రూలర్ డెవలప్మెంట్ ట్రస్ట్ స్థాపించి ఎస్సీ,ఎస్టీ పేద,వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కట్టుబడి సేవలు అందిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం రెన్యువల్ చేయకపోవడం బాధాకరమని సిపిఐ,సిపిఎం, నాయకులు నబి రసూల్, వెంకటేశ్వర్లు,శ్రీరాములు పేర్కొన్నారు.వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఆర్డిటి నేడు ప్రమాదంలో పడిందన్నారు. విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు,వ్యవసాయం, క్రీడలు, ఉపాధి ఇలా అన్ని రంగాలల్లోనూ ఆదుకుంటోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్సిఆర్ఏ రెన్యూవల్ నిలుపుదల చేయడంతో ఆ సేవలనీ ఆగిపోయే ప్రమాదం నెలకొందన్నారు.(ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్) రిజిస్ట్రేషన్ ను పునరుద్దించుకో పోవడంతో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ పై ఆధారపడిన ఎంతోమంది జీవితాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆర్డిటి సేవలు పునరుద్ధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.అనంతరం తుగ్గలి మండల రెవెన్యూ అధికారి ఎస్. రవి కు వివిధ గ్రామ ప్రజలు, సిపిఐ,సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, సిపిఎం నాయకులు,వివిధ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు మంజూరైన సంక్షేమ పథకాలు ఆరా



**మంత్రాలయం, జూన్ 19(మనం న్యూస్):** గిరిజనులకు మంజూరైన సంక్షేమ పథకాలు పై గిరిజన సంక్షేమ శాఖ ఈఓ కొండయ్య ఆరా తీశారు. గురువారం మండల పరిధిలోని పరమాన్ దొడ్డి గ్రామంలో జూగా కార్యక్రమానికి విచ్చేశారు. అనంతరం గ్రామ సచివాలయంలో గ్రామస్తులతో అందుతున్న సంక్షేమ పథకాలు పై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నూర్జ్ హన్ , తహశీల్దార్ రమాదేవి , పంచాయతీ ఏఈ మల్లయ్య , అన్ని శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పైవేట్ విద్యా సంస్థల ఆర్థిక దోపిడీని అరికట్టాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్



**బేతంచేర్ల, జూన్ 19(మనంన్యూస్):** సామాన్య మధ్యతరగతి విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షగా మారుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహములలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కి వినతి పత్రం సమర్పించి అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ మాట్లాడుతూ కేవలం ధనార్జనే ధ్యేయంగా విచ్చలవిడిగా అడ్మిషన్ స్కూల్ ఫీజు మేము నిర్ణయించిందే ఫీజు అని లక్షల రూపాయలను తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని విద్య సంస్థ లో యూనిఫామ్, బుక్స్, షూ, టై, బెల్టు, విద్యాసంస్థలను అంగళ్లుగా మార్చి వ్యాపారం నిర్వహిస్తుంటే విద్యాశాఖ అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో నిద్రపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కనీస మౌలిక వసతులు అర్హులైన ఉపాధ్యాయులు లేకుండానే నిర్వహిస్తుంటే అధికారులలో కనీస స్పందన కరువైందని ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని అరికట్టి యూనిఫామ్ బుక్స్ షూ టై బెల్టు లను విక్రయించే విద్యాసంస్థలను సీజ్ చేసి గుర్తింపు రద్దు చేయాలని కోరారు అనంతరం స్పందించిన శాసనసభ్యులు ఎంఈఓ సోమశేఖర్ ని పిలిచి విషయం తెలుసుకొని విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వెయ్యాలని ఆదేశించారు పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మండల ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు ఎల్లకృష్ణ మధు విజయ్ సమీర్ ఖదీర్ తిరుపాలు మున్నా మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదు
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా




**కర్నూలు, జూన్ 19(మనం న్యూస్):** జూన్ 21 వ తేదీన జిల్లా అంతటా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. జూన్ 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణపై గురువారం మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఓ లు, తహసీల్దార్లు తదితరులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21 తేదీన అన్ని వేదికల్లో కచ్చితంగా ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు..ఉదయం 6.15 గంటలకు వెన్యూ లో అంతా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. యోగా చేసేందుకు మ్యాట్స్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.. తాగునీరు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ తదితర ఏర్పాట్లు చేయాలన్నారు..ఏర్పాట్ల కోసం నిధులు విడుదల చేశామని, ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు.. ఎక్కడైనా ఏర్పాట్లు సరిగా చేయకపోతే మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపిడిఓ,తహసీల్దార్ బాధ్యత వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు..రేపు (శుక్రవారం) సాయంత్రం లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి కావాలని కలెక్టర్ ఆదేశించారు. వేదికలు, ట్రైనర్లు,ఇంచార్జి లు తదితర వివరాలను ఈ రోజు అందచేస్తామని, ఆ మేరకు వేదికల ట్రైనర్ లు, ఇంచార్జి లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి, ఆయా వేదికల్లో కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. రిజిస్ట్రేషన్ చేసుకున్న పౌరులు అందరూ ఈ కార్యక్రమం లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలానికి ట్రైనర్లను రిజర్వులో ఉంచడం జరిగిందని, వారిని ఒక క్లస్టర్ పాయింట్ లో ఉంచి, ఎక్కడైనా ట్రైనర్ లు లేకపోతే వెంటనే వారిని పిలుచుకునేలా ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.. కార్యక్రమంలో పాల్గొనే పబ్లిక్ అంతా కవర్ అయ్యేలా ఫోటోలు, వీడియో లు తప్పనిసరిగా తీసి ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలన్నారు..ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు.. ప్రజలకు కూడా కార్యక్రమం గురించి తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలతో మాట్లాడి ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు.. ఆయా మున్సిపాలిటీ లు, మండలాల్లో వేదికల ఏర్పాటు, ట్రైనర్లు, ఎంతమంది రిజిస్టర్ అయ్యారు, అన్ని ఏర్పాట్లు చేశారా అని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.టెలి కాన్ఫరెన్స్లో మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

## బృందావనానికి విశేష పూజలు



స్వర్ణ పల్లకిలో మృతిక బృందావనం

**మంత్రాలయం, జూన్ 19(మనం న్యూస్):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం మూల బృందావనాన్నికి విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో బృందావనాన్నికి విశేష పంచామృతాభిషేకం, ఫల పుష్పాభి షేకం, సుప్రభాత సేవ, తులసి అర్చన, ఉత్సవ రాయల పాద పూజ, కనక మహా పూజ నిత్య నిర్మల్య అభిషేకం తదితర ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం మృతిక బృందావనాన్ని స్వర్ణ పల్లకిలో ఉంచి ప్రత్యేక పూజలు చేసి , మఠం ప్రాకారం చుట్టూ ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా ఆదిపరాశక్తి మంచాలమ్మను దర్శించుకుని, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఉత్సవ మూర్తి శ్రీ ప్రహ్లాద రాయలను గజ, కొయ్య, వెండి, బంగారు రథోత్సవాలపై ఉంచి మఠం ప్రాకారంలో అశేష భక్తుల నడుమ ఘనంగా ఊరేగించారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి



**బేతంచేర్ల, జూన్ 19(మనంన్యూస్):** మున్సిపల్ కార్మికులకు ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ 75 వేల రూపాయలు ఇవ్వాలని మట్టి ఖర్చులకు 20వేల రూపాయలు ఇవ్వాలని ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై ఎల్లయ్య సిఐటియు నాయకులు మధు శేఖర్ లు డోన్ ఎమ్మెల్యే జయ సూర్య ప్రకాష్ రెడ్డి కి మున్సిపల్ కార్మికులతో కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎల్లయ్య మధు శేఖర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో నివసిస్తున్న వేల మంది ప్రజల అవసరాల ను తీరుస్తూ ప్రజారోగ్యం కాపాడటంలో మున్సిపల్ ఇంజనీరింగ్ పా రిశుద్ధ కార్మికులు విశిష్టత సేవలు అందిస్తున్నారని వారన్నారు కరోనా సందర్భంలో తమ ప్రాణాల సైతం ఫణంగా పెట్టి ప్రజలకు సేవలు చేశారని ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన కార్మికులు చాలీచాలని జీతాలు పొందుతున్నారని వారి కుటుంబాలు పస్తులతో కాలం వెలదీస్తున్నాయన్నారు దీనికి తోడు నిరంతరం పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు పెట్రోల్ డీజిల్ కరెంట్ చార్జీలు ఇంటి కిరాయిలు ఈ కాలంలో అనేక రెట్లు పెరిగాయన్నారు అయితే మున్సిపల్ కార్మికులకు ఇంజనీరింగ్ కార్మికులకు షరతులు లేకుండా తల్లికి వందన పథకంతో సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని వారు కోరారు తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు వర్తింప చేస్తే కొంతలో కొంతైనా కుటుంబాలను పస్తుల నుండి కాపాడుకోవచ్చు అని వారన్నారు పారిశుద్ధ కార్మికులకు చెల్లించిన విధంగా జీవోఎంఎస్ నెంబర్ 36 ప్రకారం ఇంజనీర్ కార్మికులకు 24,500 రూపాయలు చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరారు ఆదాయ పరిమితి తో సంబంధం లేకుండా సంక్షేమ పథకాల అమలు చేయాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఆచరణలో వీరికి కూడా సంక్షేమ పథకాల అమలు కావడం లేదన్నారు కావున తమరు వెంటనే మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న విశిష్ట సేవలకు పరిగణలోకి తీసుకొని షరతులు లేకుండా కార్మికులందరికీ తల్లికి వందనం తో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టింగు యువరాజు వెంకటరమణ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సుధాకర్ రంగడు రామాంజనేయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9 దేశవ్యాప్త సార్వతీక సమ్మె విజయవంతం చేయాలి

- జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు పరచాలి




**కామారెడ్డి, జూన్ 19 ( మనంప్రతినిధి) :** కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఐటీయూసీ అనుబంధ సంఘం మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.బాల రాజ్, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎల్ దశరథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ., కామారెడ్డి జిల్లాలో ఐదు నెలలు అవుతున్న వేతనాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని, పాఠశాలలు ప్రారంభమై పిల్లలకు పుస్తకాలు, నిత్యవసర సరుకులు, అద్దె కిరాయిలు కట్టలేక అనేక సమస్యలతో చాలీచాలని వేతనంతో కాలం వెలదీస్తున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 21వ జీవో ప్రకారం కనీస వేతనం సుప్రీంకోర్టు జీవో ప్రకారం 18000, 26,000 రూపాయలు ఇవ్వాలని అలాగే పని భద్రత పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, పగడ్బందీగా కాంట్రాక్టర్లు కట్టాలని అదేవిధంగా కాంటాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని కార్మికులకి లేదా ప్రభుత్వమే కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని జిల్లా ఆస్పత్రిలో నిరుపేద ప్రజలు అనేక సమస్యలతో వస్తున్న ప్రజలకు సేవ చేస్తున్న కార్మికులకు వేతలాలు ఇవ్వాలని, అలాగే జూలై 9 దేశవ్యాప్త సార్వతీక సమ్మె విజయవంతం చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎల్. దశరథ్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పి బాలరాజ్, మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాస్, జిల్లా కోశాధికారి ఎండి రఫీక్, నాయకులు సందీప్, ప్రవీణ్, లక్ష్మి, పద్మ, అఖిల, విజయలక్ష్మి, దశరథ్, రాజయ్య, జావిద్, బైరమ్మ, జమున, అర్జున్, నరసమ్మ, లక్ష్మి, సత్యం, భాస్కర్, దేవయ్య, పద్మ, భారతి, ఎం లక్ష్మి, జహీర్, షాబానా బేగం, సేనాబి పాజీ, య. వీరేందర్, దయాకర్, గంగాధర్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**కామారెడ్డి, జూన్ 19 ( మనం న్యూస్) :** కామారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ఏఐసీసీ అధ్యక్షుడు లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అడ్లూరు పాఠశాలలో విద్యార్థులకు నోటుబుక్కులు మరియు సామాగ్రిని పంపిణి చేయూడం జరిగింది. రానున్న రోజుల్లో దేశ భావి భారత ప్రధానిగా రాహుల్ గాంధీ నిలవాలని, దేశం కోసం ప్రాణాలర్పించిన అటువంటి కుటుంబం నుండి వచ్చిన రాహుల్ గాంధీ కి ఆశీర్వచనాలు వారి జన్మదినం సందర్భంగా ఉండాలని, కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడోయాత్ర పాదయాత్ర చేసి పేద బడుగు బలహీన వర్గాల యొక్క కష్ట సుఖాలను స్వయంగా తెలుసుకొని బీసీ కులగణన ధ్యేయంగా జాతీయ వ్యాప్తంగా నినాదిస్తూ ముందుకు వెళ్తున్నటువంటి ఆదర్శ నేత రాహుల్ గాంధీని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్, నాయకులు అజమాత్, అతీక్, అబ్దుల్ సిద్ధిక్, హన్మాండ్ల రవి, జహంగీర్, జమీల్, కైఫ్, సలీం, మౌలానా, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేలా చొరవ చూపాలి



- భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు
- పలు మండలాల్లో పర్యటించిన జిల్లా కలెక్టర్

**నిజామాబాద్, జూన్ 19 ( మనం బ్యూరో) :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేలా చొరవ చూపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బాల్కొండ మండల కేంద్రంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసుక కొరత కారణంగా ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోందనే ఫిర్యాదు ఎక్కడా రావొద్దన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో 41 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా వారంతా ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే ఆర్డీవో దృష్టికి తేవాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో విజయ్ భాస్కర్ ఉన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లిలో గురువారం రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. దరఖాస్తుల తీరును పరిశీలించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డుల ఆధారంగానే సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ మెండోరా తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్ట్ కింద మెండోరా మండలంలోని 8 గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో భూసమస్యల పరిష్కార పనితీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహశీల్దార్లు కిరణ్మయి, సంతోష్ రెడ్డి, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# భూభారతి చట్టం అమలులో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకం

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్, జూన్ 19 ( మనంబ్యూరో) :** భూభారతి చట్టం అమలులో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర ఎంతో కీలకమని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపికైన అభ్యర్థుల శిక్షణ తరగతులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించి శిక్షణ ఇప్పిస్తుందని తెలిపారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు సర్వే చేసి భూముల హద్దులు సమగ్ర వివరాలతో మ్యాపులను సమర్పిస్తే.. వాటిని ప్రభుత్వ సర్వేయర్లు పరిశీలించి ఆమోదించిన మీదట పట్టా పాస్‌బుక్‌లో జత చేయాలని సూచించారు. 50 రోజుల పాటు కొనసాగే శిక్షణను సంబంధిత అధికారులతో పాటు తాను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని చెప్పారు. ఎలాంటి ఒత్తిళ్లు ప్రలోభాలకు లోనుకాకుండా బాధ్యతలు నిర్వర్తించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన ఎంతో ముఖ్యమని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జూలై 28, 29 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తుందని, ఉత్తీర్ణులైన వారికి లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ప్రభుత్వం గుర్తింపు పత్రాలను జారీ చేస్తుందన్నారు. కలెక్టర్ వెంట సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్ తదితరులున్నారు.

# రూ. 16 లక్షలు విలువచేసే 110 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేత

**కామారెడ్డి క్రైం, జూన్ 19 (మనం న్యూస్) :** మొబైళ్లను రికవరీ చేయడంలో కమిషనరేట్లను మినహాయిస్తే జిల్లాల్లో కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. పోలీస్ కార్యాలయంలో బుధవారం రూ.16 లక్షలు విలువు చేసే 110 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఎస్పీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ., మొబైల్ పోయినా, చోరీకి గురైనా వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు ఇవ్వాలని.. సిమ్ కార్డ్ బ్లాక్ చేసి అదే నంబర్‌పై కొత్త సిమ్ తీసుకోవాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల కోసం ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి, ఒక ఆర్ఎస్ఐ, 10 మంది కానిస్టేబుళ్లతో ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. 10 రోజుల్లో టీం అధికారులు 110 ఫోన్లను రికవరీ చేశారన్నారు. ఈ సందర్భంగా టీం సభ్యులను ఎస్పీ అభినందించారు.



# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**నిజామాబాద్, జూన్ 19 ( మనం బ్యూరో) :** నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ., రాష్ట్రంలో రాహుల్ గాంధీ ఆలోచనా విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా డీసీసీబీ ఛైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ధర్మాగౌడ్, డీసీసీ డెలిగేట్ ప్రమోద్, మహిళా అధ్యక్షురాలు రేవతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినయ్, సంగెం సాయిలు, నరేంద్ర సింగ్, ప్రవీణ్, సాయి కుమార్, మలైకా బేగం, పుప్పాల విజయ, ముష్ఠ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయం- అంతర్జాతీయం

# మా దేశం నుంచే ఖలిస్థానీల కుట్రలు

- కెనడా సంచలన నివేదిక

**ఒట్టావా,జూన్ 19 :** భారత వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్న వారికి కెనడా స్వర్గధామంగా మారుతోందని న్యూఢిల్లీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. దీన్ని ఇన్నాళ్లూ పెద్దగా పట్టించుకోని ఒట్టావా తాజాగా సంచలన ప్రకటన చేసింది. తమ నేల నుంచే ఖలిస్థానీ అతివాదులు కుట్రలకు ప్రణాళికలు చేస్తున్నది నిజమేనని అంగీకరించింది. ఈమేరకు కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్ తమ వార్షిక భద్రత రిపోర్ట్‌లో వెల్లడించింది.

''భారత్‌లో హింసను ప్రోత్సహించడానికి, దాడులు చేయడానికి



అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు ఖలిస్థానీ అతివాదులు కెనడాను తమ స్థావరంగా వినియోగించుకుంటున్నారు'' అని కెనడా నిఘా సంస్థ తమ నివేదికలో తెలిపింది. ఖలిస్థానీలకు సంబంధించి 'అతివాదులు' అనే పదాన్ని ఒట్టావా ఉపయోగించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. భారత్‌లోని పంజాబ్ ప్రాంతంలో ప్రత్యేక ఖలిస్థానీ దేశం తీసుకురావాలని ఈ అతివాదులు కుట్రలు చేస్తున్నారని ఆ నివేదికలో పేర్కొంది. దౌత్య విభేదాలను పరిష్కరించుకునేలా భారత్-కెనడా ప్రధానులు ఇటీవల భేటీ అయిన వేళ.. ఈ నివేదిక రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కెనడా గడ్డపై ఖలిస్థానీ వేర్పాటువాదులు భారత వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నారని భారత్ కొన్నేళ్లుగా వాదిస్తూనే ఉంది. 1985లో ఎయిరిండియా విమానం కూల్చివేత, ఆ తర్వాత భారత్లో చోటుచేసుకున్న పలు ఉగ్ర ఘటనలను ప్రస్తావిస్తూ అనేకసార్లు కెనడా దృష్టికి తీసుకెళ్లింది. అయితే ఒట్టావా మాత్రం దీనిపై దృష్టిపెట్టేందుకు ఆసక్తి చూపించలేదు.

ఈ క్రమంలోనే 2023లో ఖలిస్థానీ వేర్పాటువాద నేత హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటనతో ఇరుదేశాల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. అతడి హత్య వెనక భారత ఏజెంట్ల పాత్ర ఉందంటూ స్వయంగా నాటి ప్రధాని జస్టిన్ ట్రూడోనే ఆరోపించడంతో దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే, కెనడాలో కొత్తగా ఏర్పడిన మార్క్ కార్నీ ప్రభుత్వం.. న్యూఢిల్లీతో బంధాన్ని పునరుద్ధరించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల జీ7 సదస్సు సందర్భంగా భారత ప్రధాని మోడీతో కార్నీ భేటీ అయ్యారు. ఇరు దేశాల్లో హైకమిషనర్లను మళ్లీ నియమించుకునేందుకు ఇద్దరు దేశాధినేతలు అంగీకరించారు.

# శ్వేతసౌధంలో విందు ట్రంప్‌ది.. బిల్లు మునీర్‌ది..!

వాషింగ్టన్, జూన్ 19: ట్రంప్ వద్ద లంచ్ ఫ్రీగా రాదు. ఈ విషయం ప్రపంచ నాయకులు మొత్తానికి తెలుసు. ఇప్పుడు పాక్ ఫీల్ మార్షల్ మునీర్‌ను ఆహ్వానించి కొసరికొసరి వడ్డించడానికి భారీ ప్లాన్లే ఉన్నాయి.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకు ఉపయోగం లేకపోతే.. ఇచ్చే విందు కూడా ఆపేస్తారు. గతంలో ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ ఖనిజాల ఒప్పందంపై సంతకం చేయకపోవడంతో విందు ఆపేసి.. ఆయన్ను శ్వేతసౌధం నుంచి సాగనంపిన విషయం తెలిసిందే. ఫక్తు వ్యాపారి అయిన ట్రంప్.. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్‌కు విందు ఇవ్వడం వెనక చాలా కారణాలున్నాయి. ఈ విందుకు పాక్ భారీగానే మూల్యం చెల్లించనుంది.

### ఇరాన్‌పై యుద్ధానికి స్థావరాలు, ఇంటెలిజెన్స్..

అమెరికా నేడో, రేపో ఇరాన్‌పై యుద్ధానికి సన్నద్ధమైపోయింది. ఈ నేపథ్యంలో ఆ దేశంతో అత్యధికంగా 909 కిలోమీటర్ల సరిహద్దును పంచుకొంటున్న పాత మిత్రుడు పాకిస్థాన్‌తో అగ్రరాజ్యానికి అవసరం పడింది. యుద్ధ సమయంలో టెహ్రాన్‌లో ఇంటెలిజెన్స్ సేకరణ, లాజిస్టిక్స్ అవసరాలు తీర్చడం, ఆ దేశంపై దాడికి వాయుసేన స్థావరాలు అమెరికాకు చాలా అవసరం. ఇప్పటికే ఇస్లామాబాద్‌కు చెందిన నూర్ఖాన్ ఎయిర్ బేస్ వంటి వాటిని అమెరికా అనధికారికంగా వాడుకుంటోందంటూ పాక్కు చెందిన సెక్యూరిటీ ఎనలిస్ట్ ఇంతియాజ్ గుల్ ఇటీవల వెల్లడించారు. గతంలో కూడా అఫ్గానిస్థాన్‌లో ఆపరేషన్లు నిర్వహించే సమయంలో ఇస్లామాబాద్‌ను అమెరికా అక్కున చేర్చుకొన్న విషయం తెలిసిందే. ఎందుకంటే పాక్కు 2,640 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. తమపై అణుబాంబు వేస్తే.. పాక్ రంగంలోకి దిగుతుందని ప్రకటించిన ఇరాన్ సైన్యాధికారులు తాజా పరిణామాలతో కంగుతిన్నారు. అలాగే తాము ఎవరినీ అణ్వాయుధాలు కోరలేదని ప్రకటించారు.

### 2,000 మెగావాట్ల విద్యుత్తు..

ట్రంప్ కుటుంబం కొత్తగా క్రిప్టో కరెన్సీ వ్యాపారంలోకి దిగింది. ఆయన



కుమారులు ఎరిక్, డొనాల్ జూనియర్, అల్లుడు జేరెడ్ కుష్నర్లు కలిసి గతేడాది వరల్ లిబర్టీ ఫైనాన్షియల్ సంస్థను ప్రారంభించారు. దీంతోపాటు ఎరిక్, డొనాల్ జూనియర్లు అమెరికన్ బిట్ కాయిన్ ఇన్‌కార్పొరేటెడ్ పేరిట ఓ బిట్కాయిన్ మైనింగ్ కంపెనీని ఏర్పాటుచేశారు. వరల్ లిబర్టీ ఫైనాన్షియల్ ఈ ఏడాది ఏప్రిల్లో పాక్కు వచ్చి ఆర్మీ చీఫ్ అసిం మునీర్ సమక్షంలో 'పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్‌లో ఒప్పందం చేసుకొన్నారు. కానీ, పాక్ క్రిప్టో కౌన్సిల్‌కు ఆర్థిక నేరాల్లో శిక్షపడిన బినాన్స్ క్రిప్టో ఎక్స్ఛేంజీ వ్యవస్థాపకుడు చాంగ్‌పెంగ్ సలహాదారు. ఈ ఒప్పందం ప్రకారం బ్లాక్‌చెయిన్, స్టేబుల్ కాయిన్ వంటి కార్యకలాపాలు చేపడతామని చెబుతున్నారు. అదే సమయంలో పాక్ క్రిప్టో కౌన్సిల్ చొరవతో 2,000 మెగావాట్ల విద్యుత్తును బిట్కాయిన్ మైనింగ్, ఏఐ డేటా సెంటర్లకు ఇస్లామాబాద్ కేటాయించనున్నట్లు ప్రకటించింది. ఇవి ట్రంప్ కుటుంబ వ్యాపారానికి నేరుగా ఉపయోగపడే కార్యక్రమం. ఈ పరిస్థితుల్లో ట్రంప్‌ను సంతోషపర్చేందుకు పాక్ 2,000 మెగావాట్లు కేటాయించింది. దీంతోపాటు బలోచిస్థాన్‌లో ఖనిజాలు కూడా దక్కించుకోవచ్చని అమెరికా ఆశిస్తోంది.

### ట్రంప్నకు నోబెల్ ప్రైజ్‌పై మద్దతు..

ఇక ట్రంప్‌నకు అత్యంత ఇష్టమైన మరో విషయంలో పాక్ సహకారం లభిస్తోంది. అదే నోబెల్ ప్రైజ్. ఆయనకు ఆ అవార్డుపై ఎప్పటినుంచో కన్ను ఉన్నా.. రెండోసారి అధికారం చేపట్టిన నాటినుంచి దీనికోసం తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఫిబ్రవరిలో ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహుతో సమావేశం వేళ కూడా.. ''వాళ్లు నాకు ఎప్పటికీ నోబెల్ ప్రైజ్ ఇవ్వరు. అది ఏమాత్రం బాగోలేదు. నేను అర్హుడను'' అని అసంతృప్తి వ్యక్తంచేశారు. దీనికితోడు మాజీ అధ్యక్షుడు ఒబామాకు దీనిని ఇవ్వడాన్ని ఆయన తప్పుపడుతూ వచ్చారు. ఈ క్రమంలో ప్రపంచంలోని పలు వివాదాల సమయంలో తానే సంధి కుదిర్చానని చెప్పుకోవడం ఆయనకు అలవాటుగా మారింది. దీనిని పాక్ బాగానే గమనించింది. ఇటీవల ఫీల్ మార్షల్ అసిం మునీర్ మాట్లాడుతూ భారత్-పాక్ మధ్య అణుయుద్ధాన్ని ఆపిన ట్రంప్ నోబెల్ ప్రైజ్‌కు పూర్తిగా అర్హుడంటూ ఓ సర్టిఫికెట్ జారీ చేశారు. ఆ తర్వాత ఆయనకు శ్వేతసౌధం నుంచి భోజనానికి ఆహ్వానం అందింది.

సాధారణంగా విదేశీ నేతల సమావేశాలు తమ సమాన హోదా నాయకులతో ఉంటాయి. కానీ, గతంలో పాకిస్థాన్‌కు చెందిన ముగ్గురు జనరళ్లకు అమెరికా శ్వేతసౌధం ఆతిథ్యం ఇచ్చింది. వీరిలో ఫీల్ మార్షల్ అయూబ్ ఖాన్, జనరల్ జియా ఉల్ హక్, జనరల్ పర్వేజ్ ముషరఫ్ ఉన్నారు. కానీ, వీరంతా శ్వేతసౌధం విందుకు వచ్చేనాటికి పాక్‌లో తిరుగుబాటు చేసి సర్వాధికారులుగా ఎదిగారు. అయితే, అసిం మునీర్ మాత్రం సైనికాధికారి హోదాలోనే ఉన్నారు. ఆయనకు ఇప్పుడు ట్రంప్ విందు ఇవ్వడంతో.. పాకిస్థాన్‌లో అనధికార నియంతృత్వం ఉందన్న విషయానికి అమెరికా ఆమోదముద్ర వేసినట్లైంది.

# ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి: అమిత్ షా

**ఢిల్లీ, జూన్ 19 :** విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనుగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా ఈ విధంగా మాట్లాడారు. ''దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలి'' అని అమిత్ షా పిలుపునిచ్చారు. మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.



# ముందు మీరు మధ్యవర్తిత్వం చేసుకోండి.. పుతిన్‌పై ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు

వాషింగ్టన్, జూన్ 19: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో ఇరుదేశాల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. పుతిన్‌పై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. పుతిన్ మధ్యవర్తిత్వ ప్రకటన గురించి ట్రంప్‌ను విలేకరులు ప్రశ్నించారు. దీనికి ఆయన స్పందిస్తూ.. తాను పుతిన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. 'నేను నిన్న పుతిన్‌తో మాట్లాడాను. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి ఆయన ముందుకొచ్చారు. నేను ఆయనతో ఇలా చెప్పాను. ''నాకు మీరు ఓ సాయం చేయండి. ఉక్రెయిన్‌తో జరుగుతున్న సంఘర్షణపై ముందు మధ్యవర్తిత్వం చేసుకోండి. ఆ తర్వాత దీని గురించి ఆలోచిద్దాం'' అని తెలిపినట్లు ట్రంప్ పేర్కొన్నారు.



### ఖమేనీని హతమార్చడంపై పుతిన్..

ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని హతమార్చడంపై స్పందించేందుకు పుతిన్ నిరాకరించారు. ఈ అంశంపై తాను చర్చించాలనుకోవడం లేదని స్పష్టంచేశారు. అది తాను కోరుకోడం లేదన్నారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా నుంచి ఇరాన్ ఏమన్నా సాయం కోరిందా అని మరో ప్రశ్నకు పుతిన్ సమాధానమిచ్చారు. తమ స్నేహితులు ఇప్పటివరకు ఎలాంటి సాయం అడగలేదన్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలో అమెరికా జోక్యం చేసుకోవడంపై రష్యా ఉప విదేశాంగమంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ హెచ్చరికలు చేశారు. ఇజ్రాయెల్‌కు సైనిక సాయం చేయడం లేదా దాడుల్లో భాగం అయితే పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుందన్నారు.

# లాడెన్‌ను అప్పుడే మరచిపోయారా?

## మునీర్కు ట్రంప్ విందుపై శశిథరూర్

ఢిల్లీ, జూన్ 19: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్‌కు డొనాల్డ్ ట్రంప్ విందు ఇవ్వడంపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయం కల్పించడంలో పాక్ పాత్రను అమెరికా మరచిపోకూడదన్నారు. ''వరల్డ్ ట్రేడ్ సెంటర్ దాడిలో ప్రధాన సూత్రధారి ఒసామా బిన్ లాడెన్ ఎపిసోడ్‌ను పాక్ బృందాన్ని కలిసిన కొంతమంది చట్టసభ సభ్యులు మరచిపోయినప్పటికీ అమెరికా ప్రజలు మాత్రం అంత తొందరగా మరచిపోలేరు. ఇటువంటి వ్యక్తి దొరికేవరకు.. ఓ ఆర్మీ క్యాంపు దగ్గర పాక్ దాచిపెట్టిన విషయాన్ని అమెరికన్లు అంత తొందరగా మరచిపోరు'' అని శశిథరూర్ పేర్కొన్నారు. ఉగ్రవాదులకు శిక్షణాపరంగా, ఆర్థికంగా మద్దతు ఇవ్వకూడదనే విషయాన్ని పాకిస్థాన్‌కు అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా హెచ్చరించి ఉంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అగ్రనాయకత్వంలో కొందరితో తనకు భిన్నాభిప్రాయాలు ఉన్న మాట వాస్తవమేనని ఆ పార్టీ సీనియర్ నేత శశి థరూర్ అంగీకరించారు. అయితే, వాటిని పార్టీ అంతర్గత సమావేశంలోనే చర్చిస్తానని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై ఏర్పాటైన ఓ అఖిలపక్ష బృందానికి నాయకత్వం వహించిన థరూర్.. ప్రధాని మోడీని కలిసిన సందర్భంలో పర్యటన గురించి తప్ప వేరే విషయాలేవీ చర్చించలేదని స్పష్టం చేశారు.

## పాణ్యం సిమెంట్ కార్మికుల ధర్నా

- **పునః ప్రారంభం హామీ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి**

**బేతంచేర్ల, జూన్ 19(మనం న్యూస్):** మండల పరిధిలో సిమెంట్ నగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ గత కొన్ని నెలలుగా మూతపడ్డ ఫ్యాక్టరీను తిరిగి ప్రారంభించి ఉపాధి కల్పించాలని కోరుతూ కార్మికులు బేతంచెర్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద వారు ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభించాలని వారు రోడ్డుపై బెటాయించి నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడు తూ ఫ్యాక్టరీ పునః ప్రారంభానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లకు తగిన న్యాయం జరిగేలా తనవంతు సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఫ్యాక్టరీ కార్మికుల చేస్తున్న ధర్నా మద్ద తు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఉన్నం ఎల్ల నాగయ్య, పోలూరు రాఘవరెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, బుగ్గన ప్రసన్న లక్ష్మి, వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# రద్దయిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలి

- **సీపీఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డికి వినతి**

**బేతంచేర్ల, జూన్ 19(మనం న్యూస్):** కరోనా సందర్భంగా రద్దయిన రైళ్ళను పునరుద్ధరించాలని మండల కార్యదర్శి భార్గవ్ మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్ డి.దస్తగిరి పట్టణ కార్యదర్శి పి.నాగరాజు కోదండ రాముడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వంద సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారు ముందు చూపుతో బేతంచర్ల పట్టణంలో రైల్వే స్టేషన్ ను ఏర్పాటు చేసి బేతంచర్ల మీదుగా వెళ్లే అన్ని రైళ్ళు ను ఆపారని కరోనా తరువాత ఏ ఒక్క




ఎక్స్ ప్రెస్ రైలు ఆగకపోవడంతో బేతంచెర్ల ప్రజలు ప్రయాణికులు ఉద్యోగస్తులు కార్మికులు విద్యార్థులు నిరుద్యోగులు వృద్ధులు వికలాంగులు పూలు, పండ్లు, కూరగాయలు, టీ, సమోసా అమ్ముకునేవారు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు తక్షణమే శాసనసభ్యులు స్పందించి కరోనా కారణంగా బేతంచర్లలో రద్దు చేసిన ఎక్స్ ప్రెస్ రైళ్ళను అన్నింటిని తక్షణమే నిలుపుదల చేసే విధంగా రైల్వే ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు

అదేవిధంగా విభజన హామీలను భాగంగా విశాఖ రైల్వే జోన్లు ఏర్పాటు చేస్తూ కర్నూలు నంద్యాల రైల్వే స్టేషన్లను గుంతకల్ డివిజన్ పరిధిలో కలిపి తిరుపతి కేంద్రంగా నూతన రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని రాయలసీమ ప్రాంత అభివృద్ధికి తమవంతుగా చట్టసభల్లో మాట్లాడాలని కోరారు అనంతరం స్పందించిన శాసనసభ్యులు కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రైల్వే సమస్యల విషయమై ఇదివరకే రైల్వే అధికారులతో సంప్రదింపులు జరిపామని వీలైనంత త్వరలో బేతంచెర్ల అన్ని ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### దళిత సర్పంచిని అవమానించిన వారిపై
## అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- **సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు**




జూపాడు బంగ్లా, జూన్ 19(మనం న్యూస్): ఆదోని మండలం డానాపురంలో దళిత సర్పంచును అవమానించిన ఎమ్మెల్యే పార్థసారథి, తెలుగుదేశం నాయకులు గుడిసె కృష్ణమ్మలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ దళితులను అవమానించడం బాధాకరమని తక్షణమే కేస్ నమోదు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ ఆదోని మండలం పరిధిలోని డనాపురం గ్రామంలో 16.06.25న సోమవారం సాయంత్రం కూటమి ప్రభుత్వ సంవత్సర పాలనకు సంబరాలు జరుపుకుంటూ.. వీధుల్లో తిరుగుతూ నడి వీధిలో గుడి దగ్గర జరిగిన సభలో దళితుడైన సర్పంచ్ చంద్రశేఖర్‌ను అవమానించడం బాధాకరమన్నారు. ఆ సభ దగ్గర ఎమ్మెల్యే పార్థసారథి సభను ప్రారంభించి మాట్లాడే మధ్యలో గ్రామ సర్పంచ్ ను పిలవడమనేదే అవమానించడం అన్నారు. వేదికపైనే సర్పంచ్ కుల ప్రస్తావన చేస్తూ.. ఎస్సీ కాబట్టి వేదికపైకి రాడు అని టిడిపి పార్టీ రాష్ట్ర నాయకులు గుడిసె కృష్ణమ్మ చెప్పడం, దానికి ఎలాంటి రియాక్షన్ లేకుండానే ఎమ్మెల్యే మిన్నకుండటం వివక్షను ప్రోత్సహించడం తప్ప వేరే కాదన్నారు.కావున దళితుడైన సర్పంచ్ చంద్రశేఖర్ వేదిక దగ్గరికి వచ్చినా పైకి పిలవకుండా కిందే నిలబెట్టి మాట్లాడడం అంటరానితనాన్ని అక్షరాల పాటించిన దానికి సంకేతం అన్నారు. సంవత్సర పాలనలో ఏం సాధించారో తెలియదు కానీ, రాజ్యాంగ హక్కులను గౌరవించి, సాటి మనిషిని మనిషిగా చూడటాన్ని నేర్చుకోవాలని హితువుపలికారు. ఆదోని ఎమ్మెల్యే రోజువారీగా గట్టిగా మాట్లాడే వట్టి మాటలను కట్టిపెట్టి, ఆదోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అంటరానితనాన్ని అంతమొందించాలన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, మాగబుల్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- **ఆర్‌యుఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ డిమాండ్**

**మంత్రాలయం, జూన్ 19(మనం న్యూస్):** పాఠశాలలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్‌యూఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్, ఆర్‌పిఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిద్ డిమాండ్ చేశారు. గురువారం మంత్రాలయం మండల పరిధిలోని చిలకల డోణ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలను సందర్శించడం జరిగిందన్నారు. పాఠశాల విద్యార్థులకు మరుగుదొడ్లు లేక ముళ్ళ కంపలోకి పంపించడం దారుణం అన్నారు. ఆ ముళ్ళ కంపుల జరగరాని ప్రమాదం ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. గతంలో ఉన్న హెచ్ఎంకు మరుగుదొడ్లపై ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు మీరు పట్టించుకొని వెంటనే విద్యార్థులకు మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎంపీపీఎస్ పాఠశాల సమస్యలకు నిలయంగా



మారిందన్నారు.
అనంతరం, వంటశాలను తనిఖీ చేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కట్టెల పొయ్యి మీద వంట చేయడం దారుణమన్నారు .వంట ఏజెన్సీ ఆన్లైన్ లో ఎవరి పేరు మీద అయితే ఉందో వారే మధ్యాహ్న భోజన పథకం నిర్వహించేలా ఎంఈఓ హెచ్ఎంలు చొరవ చూపాలన్నారు. పాఠశాల చుట్టుపక్కల వెంటనే ముళ్ళ కంపలను తొలగించాలని లేకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

### చెత్త శుద్ధి యంత్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే

**బేతంచర్ల, జూన్ 19(మనం న్యూస్):** పట్టణంలో ఓల్ డంప్ యార్డ్లో లెగసీ వేస్ట్ను ఆధునిక యంత్రాల సహాయంతో శుద్ధి చేసే ప్రక్రియను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పరిశీలించారు అనంతరం వారు మాట్లాడుతూ శుద్ధి చేసిన వ్యర్థాలలో కంపోస్ట్ మెటీరియల్ను రైతుల పొలాల్లో సహజ ఎరువుగా ఉపయోగించవచ్చు రాళ్లు మరియు ఇతర కఠిన వ్యర్థాలను భూగర్భ గుంతల పూడికకు వినియోగించవచ్చు ప్లాస్టిక్ మరియు ఇతర తిరిగి ఉపయోగించదగిన పదార్థాలను వేరు చేసి ప్లాస్టిక్ శుద్ధి కర్మాగారాలకు పంపిస్తారు. ఈ ప్రక్రియ పర్యావరణ పరిరక్షణకు మరియు వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుంది అన్నారు.



## నీచ రాజకీయాలు చేయడంలో జగన్ దిట్ట

- **టీడీపీ సీనియర్ నేత మలకన్న**



**దేవనకొండ,జూన్ 19(మనం న్యూస్):** జగన్ నీచ, శవ రాజకీయాలు చేస్తూ తాజాగా ఇద్దరి మరణానికి కారణమయ్యారని టిడిపి సీనియర్ నేత మలకన్న విమర్శించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్కు ప్రజాస్వామ్యం పట్ల గౌరవం లేదు.పోలీసులంటే లెక్క లేదని కోర్టులు, నిబంధనాలను ఖాతారు చేయరు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని బెట్టింగ్ వల్ల ఆత్మహత్య చేసుకున్న వ్యక్తిని పరామర్శించడానికి జగన్ వెళ్లడం ఏంటని, పరామర్శకు వెళ్లేటప్పుడు మంది మార్బలంతో హడావుడి ఏంటని డీజే పాటలు, తీన్మార్లతో ఎవరైనా పరామర్శకు వెళ్తారా! రప్ప రప్ప తలలు నరుకుతామంటూ ఫ్లెక్సీలు ప్రదర్శిస్తారా?' అని నిలదీశారు. ఇలాంటి వికృత చేష్టలకు మద్దతు పలికే జగనే రాజకీయాల్లో కొనసాగేందుకు అనర్హుడు అన్నారు. కాగా జగన్ స్వార్థ రాజకీయానికి రెండు నిండు ప్రాణాలు బలయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ కాన్వాయ్ లోని వాహనం ఢీకొని సింగయ్య అనే వ్యక్తి తీవ్ర గాయాలైకొన ఊపిరితో కొట్టుమిట్టలాడుతున్న వైసిపి నేతలు ఎవరు ఆయనను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా రోడ్డు పక్కనే వదిలేశారని, వారంతా మానవత్వం మరిచిపోయారని విమర్శించారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించాలి

- **ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి**

**బేతంచేర్ల, జూన్ 19(మనం న్యూస్):** డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా బేతంచేర్ల పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు ఈ ప్రజలు నీటి సరఫరా రోడ్లు పింఛన్లు విద్యుత్ ఆరోగ్య సదుపాయాలు వంటి ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు ఎమ్మెల్యే వినతి పత్రాలను పరిశీలించి సంబంధించిన మండలం అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు ప్రజలు



ఎప్పుడైనా తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచిస్తూ వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డిఓ ఎంపీడీవో ఫజల్ రెహమాన్, తాసిల్దార్ నాగమణి, నగర కమిషనర్ హరిప్రసాద్, తెలుగు దేశం పార్టీ నాయకులు ఉన్నం ఎల్ల నాగయ్య, పోలూరు రాఘవరెడ్డి, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, బుగ్గన ప్రసన్న లక్ష్మి, పోలూరు శ్రీనివాస్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వర్ధన్ రెడ్డి, ఎరుకల చెరువు శివ, భీమేష్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడి మృతి



**దేవనకొండ, జూన్ 19(మనం న్యూస్):** దేవనకొండ మండల కేంద్రానికి చెందిన హరిజన గోపాల్(42) అనే పారిశుద్ధ కార్మికుడు మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న టిడిపి నేతలు బండి గింజల రంగన్న,ఆకుల వీరేష్, మాల బండ్లయ్య,కుక్కల తిమ్మయ్య, సుభాన్,గోవిందు, బంగి రంగన్నల్లు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తోటి కార్మికులతో కలిసి రూ. 10,000 వేలుఆర్థిక సాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆకస్మికంగా గ్రామపంచాయతీ కార్మికుడు మృతి చెందడం బాధాకరమని మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందించడానికి కృషి చేస్తామన్నారు.

## తిరుమలలో భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల ఉచిత ట్రిప్పులు



**తిరుమల, జూన్ 19(మనం న్యూస్):** తిరుమలలో భక్తులను ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరవేసేందుకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచిత సర్వీసును అందుబాటులోకి తీసుకొచ్చినట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రి సర్కిల్ వద్ద గురువారం ఉదయం ఆర్టీసీ బస్సుల ఉచిత ట్రిప్పులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తిరుమలలో ప్రైవేట్ వాహనాలు భక్తుల నుండి వసూలు చేస్తున్న అధిక ఛార్జీలను అరికట్టడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించేందుకు బస్సులను ఉచితంగా తిప్పాలని ఏపీఎస్ ఆర్టీసీని కోరినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ అధికారులు త్వరితగతిన బస్సులను ఉచితంగా తిప్పేందుకు ముందుకు రావడంతో కృతజ్ఞతలు తెలియజేశారు. తిరుమలలో శ్రీవారి ధర్మ రథాలు తిరిగే మార్గంలోనే ఈ బస్సులు తిరుగుతూ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరవేస్తాయని చెప్పారు. ఈ ఉచిత ట్రిప్పుల ద్వారా భక్తులకు, ఆర్టీసీకి అదనపు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే టీటీడీ శ్రీవారి ధర్మ రథాల ద్వారా తిరుమలలో ప్రతిరోజూ 300 ట్రిప్పులను తిప్పుతోందని చెప్పారు. ఆర్టీసీ బస్సులు తోడవ్వడంతో అదనంగా 80 ట్రిప్పులు తిప్పేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. ప్రతి రెండు నిమిషాలకు బస్సులు అందుబాటులోకి రావడంతో ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతమవ్వడంతో పాటు బహుముఖ ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. భక్తులు బస్టాండ్ వద్దకు రాకుండా తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఈ ఆర్టీసీ బస్సులను ఎక్కడం ద్వారా నేరుగా తిరుపతికి వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. తిరుమలలో ఏ ప్రాంతంలో బస్సు ఎక్కినా తిరుమల నుండి తిరుపతికి మాత్రమే ఛార్జీలు ఉంటాయని, ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా ఉచితంగా ఈ సర్వీసులను భక్తులు వినియోగించుకోవాలని ఆయన భక్తులను కోరారు.

### మంత్రాలయం టూ పంచముఖి బస్సు సర్వీసు ప్రారంభం

**మంత్రాలయం, జూన్ 19(మనం న్యూస్):** మంత్రాలయం టూ పంచముఖ బస్సు సర్వీసును ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు , అసిస్టెంట్ మేనేజర్ మల్లయ్యలు గురువారం ప్రారంభించారు.




ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఘ వేంద్రస్వామి దర్శనానికి వచ్చే భక్తులు పంచముఖ లోని ఆంజనేయ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని, దీనిని దృష్టిలో ఉంచి భక్తులు కొరకు ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పోల నాగరాజు ఆదేశాలుతో పంచముఖ బస్సు సర్వీసు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ , సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో అక్రమ దందాలు

- **బియ్యం నిల్వచేసిన అక్రమార్కులపై చర్యలేవి?**
- **రాత్రి పట్టుబడింది 2000 బస్తాలు ఉదయం చూస్తే 109 బస్తాలు**
- **ఇక్కడ దొంగలు ఎవరనేది సవాల్‌గా మారిన సమస్య**
- **సంబంధిత అధికారులు మౌనం ఎందుకు పాటిస్తున్నారు?**




ఆదోని, జూన్ 19(మనం న్యూస్): ఆదోని పట్టణంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలంలో రకరకాల దందాలు కొనసాగిస్తున్నారని అక్రమ దందాలకు పాల్పడిన వారిని క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే అజయ్ బాబు, సిపిఐ పట్టణ, మండల కార్యదర్శిలు సుదర్శన్, కల్లుబావిరాజు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబి నాగరాజు,, గ్గఖీ భీమేష్ ,రైతు సంఘం నాయకులు బసాపురం గోపాల్, మదిరి ఎల్లప్ప ,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు గంగన్న, తదితరులు స్థానిక సబ్ కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆదోనిలో ఆక్రమార్కులు ఆరు తేరీ పోయారని, కొత్త కొత్త విధానాలతో ఆక్రమాలు చేసి అందరిని ఆశ్చర్యపరుస్తున్నారని ఆధార మార్పులతో రిజిస్ట్రేషన్ చేయడం, చనిపోయిన వ్యక్తి భూములను కొట్టివేయడం, రాత్రికి రాత్రి పేదల బియ్యాన్ని మాయ చేయడం ,అన్నీ తెలిసినా తెలియనట్లుగా ఆదోని శాసనసభ్యులు మౌనంగా ఉండి నటించడం చూస్తుంటే ప్రజల చెవుల్లో పూలు పెడుతున్నట్లు ఉందన్నారు. దీన్ని బట్టి చూస్తే నియోజకవర్గ ప్రజలను పిచ్చివాళ్లుగా చేస్తున్నారని, ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేదన్నట్లు కొద్ది రోజుల క్రితం గోనెగండ్ల మండలంలో రేషన్ బియ్యం లారీ పట్టుబడినప్పటికీ వారిపై యంత్రాంగం నామమాత్రపు కేసులు బనాయించి వదిలేయడం జరిగిందన్నారు. జరిగిన సంఘటన మరవక ముందే కూటమి ప్రభుత్వానికి చెందిన కొంతమంది నాయకులు రేషన్ బియ్యం దందాకు పాల్పడుతూ అక్రమార్కులు 2000 బస్తాలు రేషన్ బియ్యము సిరుగుప్ప రోడ్డులో ఒక ప్రైవేట్ గోడెన్ యందు ఉన్నాయని సమాచారం అందుకున్న సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు చూసి ఆశ్చర్యపోయారు.

వెంటనే స్థానిక అధికారులను పిలిపించి అందరూ సమక్షంలోనే ఆ గోడనుకు సీజ్ చేయడం జరిగింది. తెల్లవారే సరికి కేవలం 109 బస్తాలు చూపించి మిగిలిన బియ్యం సంచులను ఎవరో దొంగిలించారని కట్టుకథలు చెప్పుతూ మండల రెవెన్యూ అధికారులు వారి స్వలాభాల కోసం ఆక్రమాలకు పాల్పడుతూ ఉన్నారని, ఈ అవినీతి అక్రమాలకు పాల్పడినటు వంటి పౌర సరఫరా శాఖకు సంబంధించినటువంటి అధికారులపై తక్షణమే కఠినమైన చర్యలు తీసుకో వాలని సీపీఐ పార్టీగా డిమాండ్ చేయడమైనది. లేని పక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యం లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ ప్రజా సంఘాల ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది.

## ఎఫ్‌సీపీఏ యాక్టును పునరుద్ధరించాలి
### సూగురు ఉప సర్పంచ్ గోపీనాథ్



**మంత్రాలయం, జూన్ 19(మనం న్యూస్):** ఎఫ్‌సీపీఏ యాక్టును పునరుద్ధరించి, ఆర్డిటి సంస్థను కేంద్ర ప్రభుత్వం కాపాడాలని సూగురు ఉప సర్పంచ్ గోపీనాథ్ కోరారు. గురువారం మంత్రాలయం నియోజకవర్గం కేంద్రంలో ఎఫ్‌సీపీఏ యాక్టును పునరుద్ధరించాలని సూగురు, తిమ్మాపురం, వగరూరు, మాధవరం గ్రామాలకు చెందిన ఆర్ డి టి సంస్థ నుంచి లబ్ధి పొందిన లబ్ధిదారులు అంబేద్కర్ సర్కిల్ నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం, తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డిటి సంస్థ వల్ల, గ్రామాల్లోని పేద బడుగు వర్గాల వారి కోసం గృహ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. అలాగే పేద విద్యార్థులకు స్కాలర్షిప్ ద్వారా పుస్తకాలు బట్టలు ఫీజులు చెల్లించారని తెలిపారు. పేదల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. అలాంటి సంస్థకు నిధులు ఆగిడిపోవడం వల్ల పేద ప్రజలకు అందే సౌకర్యాలు కరువు అవుతాయని వాపోయారు. యాక్టును రద్దు చేసే ఎఫ్‌సీపీఏ పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవి, అంజి, ప్రభాకర్, శ్రీనివాస్ నాయక్, సుధా, వాగరురు దానియేలు, తగ్రామస్తులు పాల్గొన్నారు.

# గిల్ కచ్చితంగా ట్రోఫీతోనే తిరిగి వస్తాడు: విరాట్ కోహ్లీ

భారత టెస్టు క్రికెట్ లో కొత్త శకం ఆరంభం కానుంది. దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లి, లెజెండరీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, కెప్టెన్ రోహిత్ శర్మ వంటి దిగ్గజాల నిష్క్రమణ తర్వాత.. యువ ఆటగాడు శుబ్ మన్ గిల్ సారథ్యంలో భారత జట్టు ఇంగ్లండ్ గడ్డ మీద తొలి టెస్టు సిరీస్ ఆడబోతోంది. లీడ్స్ లో శుక్రవారం నుంచి ఇరుజట్ల మధ్య పోటీ ఆరంభం కానుంది.

**ఆ ముగ్గురికే సాధ్యమైంది**

అయితే, ఇంగ్లండ్ లో టెస్టు సిరీస్ గెలవడం అంత సులువేమీ కాదు. ఇప్పటి వరకు టీమిండియా కేవలం మూడుసార్లు మాత్రమే అక్కడ విజయపతాక ఎగురవేసింది. 1971లో అజిత్ వాడేకర్ సారథ్యంలో.. 1986లో కపిల్ దేవ్ కెప్టెన్సీలో.. చివరగా 2007లో రాహుల్ ద్రవిడ్ నాయకత్వంలో ఇంగ్లండ్ ను తమ స్వదేశంలో భారత్ ఓడించగలిగింది.

ఈ నేపథ్యంలో.. కఠిన సవాలుకు సిద్ధమైన గిల్ సేన.. సొంతగడ్డపై మరింత పటిష్టంగా కనిపించే స్టోక్స్ బృందాన్ని ఏ మేరకు కట్టడి చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో టీమిండియా దిగ్గజం కపిల్ దేవ్ భారత జట్టు కొత్త సారథి శుబ్మన్ గిల్ను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గిల్ తప్పక ట్రోఫీతో తిరిగి వస్తాడని ధీమా వ్యక్తం చేశాడు.




ఈ మేరకు.. ''అతడు ప్రతిభావంతుడైన ఆటగాడు. ఇప్పుడు భారత జట్టుకు కెప్టెన్ అయ్యాడు. కచ్చితంగా ట్రోఫీతోనే అతడు ఇంగ్లండ్ నుంచి తిరిగి వస్తాడు. మనల్ని గర్వపడేలా చేస్తాడు. టీమిండియాకు గుడ్ లక్. మనోళ్లు విజేతలుగా తిరిగి వస్తారు. వారికి ఆ సత్తా ఉంది'' అని కపిల్ దేవ్ టైమ్స్ ఆఫ్ ఇండియాతో వ్యాఖ్యానించాడు.

**విచిత్రంగా అనిపించింది..**

టీమిండియా- ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్ ను పటౌడీ ట్రోఫీగా పిలిచేవారు. అయితే, తాజాగా దీనికి ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు టెండుల్కర్-ఆండర్సన్ ట్రోఫీగా నామకరణం చేసింది. ఈ విషయంపై స్పందించిన కపిల్ దేవ్.. ''నాకైతే ఇది విచిత్రంగా అనిపించింది. ఇలా కూడా జరుగుతుందా అని ఆశ్చర్యం వేసింది. మరేం పర్లేదు. క్రికెట్ లో అన్నీ జరుగుతాయి. క్రికెట్ అంటే క్రికెటే. మైదానంలో ఆటగాళ్ల స్ఫూర్తి అలాగే ఉంటుంది'' అని పేర్కొన్నాడు. కాగా పటౌడీ పేరును తొలగించడంపై ఈసీబీపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ, టీమిండియా లెజెండరీ బ్యాటర్ సచిన్ టెండుల్కర్ విజ్ఞప్తి నేపథ్యంలో.. భారత్- ఇంగ్లండ్ టెస్టు సిరీస్ గెలిచిన కెప్టెన్ కు పటౌడీ పేరిట పతకం అందించాలని ఈసీబీ నిర్ణయించింది.

# ఇండస్ట్రీ నుంచే వెలేశారు

వాణిజ్య ప్రకటనలతో ప్రయాణం మొదలుపెట్టిన బనితా సంధు ప్రస్తుతం హీరోయిన్ గా రాణిస్తోంది. తమిళంలో ఆదిత్య వర్మ (అర్జున్ రెడ్డి రీమేక్).. హిందీలో అక్టోబర్, సర్దార్ ఉద్ధమ్, మదర్ థెరిస్సా అండ్ మి చిత్రాలు చేసింది. హాలీవుడ్ లో సినిమాతో పాటు వెబ్ సిరీస్ లలోనూ యాక్ట్ చేసింది. ప్రస్తుతం అడివి శేష్ గూఢచారి 2 చిత్రం చేస్తోంది. అలాగే ఆమె నటించిన



డిటెక్టివ్ షెర్డిల్ మూవీ జీ5లో శుక్రవారం (జూన్ 20) రిలీజ్ కానుంది.

**నిద్ర లేకుండా షూటింగ్**

ఈ సందర్భంగా ప్రమోషన్స్ లో బనితా సంధు మాట్లాడుతూ.. బాలీవుడ్ లో ఇప్పుడిప్పుడే అంతా మెరుగవుతోంది. కెరీర్ తొలినాళ్లలో ఇండస్ట్రీ ఎలా ఉంటుందో నాకు తెలీదు. నేను ఊహించినదానికన్నా భిన్నంగా ఉండేది. 16-18 గంటలు పని చేసేదాన్ని. రోజంతా షూటింగ్ చేయించుకుని రాత్రికి పంపించేవాళ్లు. సరైన నిద్ర ఉండేది కాదు. ఒక్కోసారి 24 గంటలు మేల్కొనే ఉండాల్సి వచ్చేది. అప్పుడు నేను.. నాకోసం, మిగతా సిబ్బంది కోసం నిలబడ్డాను.

**బ్లాక్ లిస్ట్.. లెక్కచేయను**

ఇది మంచి పద్ధతి కాదని నిర్మాతలను వారించాను. బహుశా అందుకేనేమో నన్ను ఆ ఇండస్ట్రీలో బ్లాక్ లిస్ట్ లో పెట్టారు. అయినా నేను అస్సలు పట్టించుకోను. నాకు ఏదనిపిస్తే అదే చేస్తాను. దక్షిణాది సినిమా (ఆదిత్య వర్మ) చేసినప్పుడు నన్ను బాడీ షేమింగ్ చేశారు. పీలగా, చెండాలంగా ఉన్నానని కామెంట్లు చేశారు. సినిమాలో ఇలాంటిదానికి హీరో ఎలా పడిపోయాడని వెకిలిగా మాట్లాడారు. బాడీ షేమింగ్ అనుభవించడం అదే మొదటిసారి అని బనితా చెప్పుకొచ్చింది.

# ప్రపంచంలో ధనిక క్రికెట్ బోర్డులు ఇవే..
# చివరి స్థానంలో ఊహించని పేరు

ప్రస్తుత జమానాలో క్రికెట్ కేవలం క్రీడ మాత్రమే కాదు. ఇదో పెద్ద వ్యాపారం. ఇందులో ఆయా దేశ క్రికెట్ బోర్డులు లెక్కలేనంతగా సంపాదిస్తున్నాయి. స్పాన్సర్లు, ప్రసార ఒప్పందాలు, ఇతరత్రా మార్గాల ద్వారా కోట్లకు పడగలెత్తుతున్నాయి. గత దశాబ్దకాలంలో ఈ ధోరణి మరింత పెరిగింది. ఐపీఎల్ లాంటి లీగ్ ల వల్ల క్రికెట్ బోర్డుల రూపురేఖలే మారిపోయాయి. ఎంతలా అంటే, క్రికెట్ బోర్డులు దేశ ఆర్థిక వ్యవస్థలను శాశించేంతలా మారాయి. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఇందుకు ప్రధాన ఉదాహరణ.

బీసీసీఐ ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డు కావడమే కాక ప్రపంచ క్రికెట్ మొత్తాన్నే శాశిస్తుంది. ఐపీఎల్ బీసీసీఐ దశ దిశనే మార్చేసింది. 2008లో ఐపీఎల్ ప్రారంభమయ్యాక బీసీసీఐ రెవెన్యూ అమాంతం పెరిగింది. ధనార్జన విషయంలో ఇతర దేశ క్రికెట్ బోర్డులు బీసీసీఐ దరిదాపుల్లోకి కూడా రాలేపోతున్నాయి. తాజా లెక్కల ప్రకారం బీసీసీఐ నికర విలువ రూ. 19052 కోట్లని తెలుస్తుంది.

ఈ సంఖ్యతో పోలిస్తే మిగతా క్రికెట్ బోర్డుల ఆదాయం కనీసం పది శాతం కూడా లేదు. తాజా నివేదికల ప్రకారం.. బీసీసీఐ అత్యంత సంపన్న క్రికెట్ బోర్డుగా ఉంటే, టెస్ట్ హోదా కలిగిన దేశాల్లో న్యూజిలాండ్ అతి పేద క్రికెట్ బోర్డుగా ఉంది. న్యూజిలాండ్ 1926 నుంచి అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నా ఆ దేశ క్రికెట్ బోర్డు క్రికెట్ ను కేవలం క్రీడగానే చూస్తుంది. దీన్ని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ఏ నాడు ఆదాయ వనరుగా పరిగణించలేదు. కడు పేదరికాన్ని అనుభవిస్తున్న మన దాయాది దేశం పాకిస్తాన్ కూడా క్రికెట్ ద్వారా కోట్లు సంపాదిస్తుంటే న్యూజిలాండ్ మాత్రం క్రీడలో విలువలకు ప్రాధాన్యత ఇస్తూ చాలీచాలని ఆదాయంతో సరిపెట్టుకుంటుంది.

బీసీసీఐ విషయానికొస్తే.. భారత్ లో క్రికెట్ ప్రతి పౌరుడి జీవితంలో ఓ భాగం. ఇదే బీసీసీఐకి అతి పెద్ద పెట్టుబడి. బీసీసీఐ బలమంతా భారత క్రికెట్ మార్కెట్ లోనే ఉంది. అంతర్జాతీయంగా ప్రముఖ కంపెనీలు భారత అభిమానుల ముందుకు రావడానికి వందల కోట్లు ఖర్చు పెడతాయి. ఐపీఎల్ పరిచమయ్యాక బీసీసీఐ తలరాతే మారిపోయింది.

ఈ లీగ్ మీడియా హక్కులు చిన్న దేశ క్రికెట్ బోర్డుల ఆదాయం కంటే చాల ఎక్కువ. భారత పురుషుల సీనియర్ క్రికెట్ జట్టు స్పాన్సర్ షిప్ లు బీసీసీఐకి మరో ప్రధాన ఆదాయ వనరు. భారత్ లోనే జరిగే మ్యాచ్ ల టిక్కెట్ల అమ్మకాలు మరియు ఆ మ్యాచ్ ల ద్వారా జరిగే వ్యాపారం బీసీసీఐకి అదనపు ఆదాయం.

డిజిటల్ ఒప్పందాలు, ఐసీసీ ఆదాయ వాటాలు బీసీసీఐకి మరో భారీ ఆదాయ వనరు. ఇలా బీసీసీఐ నాలుగు చేతులా సంపాదిస్తూ ప్రపంచంలో అత్యంత ధనిక బోర్డుగా చలామణి అవుతుంది.

**తాజా నివేదికల ప్రకారం ప్రపంచంలోని టాప్ 10 ధనిక క్రికెట్ బోర్డుల వివరాలు ఇలా..**

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు-రూ. 19052 కోట్లు
క్రికెట్ ఆస్ట్రేలియా- రూ. 684 కోట్లు
ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు- రూ. 510 కోట్లు
పాకిస్తాన్ క్రికెట్ బోర్డు- రూ. 476 కోట్లు
బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు- రూ. 441 కోట్లు
క్రికెట్ సౌతాఫ్రికా- రూ. 406 కోట్లు
జింబాబ్వే క్రికెట్ బోర్డు- రూ. 329 కోట్లు
శ్రీలంక క్రికెట్ బోరు- రూ. 173 కోట్లు
వెస్టిండీస్ క్రికెట్ బోర్డు- రూ. 129 కోట్లు
న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు- రూ. 77 కోట్లు

# ఒంటరిగా ఉండాలనుంది: అభిషేక్



బాలీవుడ్ స్టార్ హీరో అభిషేక్ బచ్చన్ పెట్టిన ఇన్ స్టా పోస్ట్ ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. తాను ఈ జనసమూహం నుంచి కొన్ని రోజులు దూరంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అరుదుగా కనిపించే అభిషేక్ బుధవారం రాత్రి ఓ సందేశాన్ని పంచుకున్నారు. ''నేను కొన్ని రోజులు అన్నిటికీ దూరంగా ఉండాలనుకుంటున్నాను. ఈ జనసమూహానికి దూరంగా ఉంటూ నన్ను నేను తెలుసుకోవాలనుకుంటున్నా. నాకెంతో ఇష్టమైన వారికోసం ఉన్నదంతా ఇచ్చేశాను. ఇప్పుడు నాకోసం సమయం కేటాయించుకోవాలనిపిస్తోంది. నన్ను నేను తెలుసుకోవడానికి సమయం కావాలి'' అనే సందేశాన్ని షేర్ చేశారు. 'కొన్నిసార్లు నిన్ను నువ్వు తెలుసుకోవాలంటే.. అందరికీ దూరంగా ఉండాలి' అని ఈ పోస్ట్ కు కామెంట్ పెట్టారు. ప్రస్తుతం ఇది వైరల్ అవుతుండగా.. అభిమానులు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'మీరు కొన్ని రోజులు నటనకు విరామం తీసుకుంటున్నారా' అని ఒకరు అడగ్గా.. 'త్వరలోనే కొత్త అభిషేక్ ను చూస్తాం' అంటూ మరొక నెటిజన్ తన అభిప్రాయాన్ని కామెంట్ చేశారు. ఇక అభిషేక్ కనిపించిన చివరి చిత్రం 'హౌస్ఫుల్ 5'. అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ సినిమాలో రితేశ్ దేశ్ ముఖ్, జాక్వలిన్ ఫెర్నాండేజ్, సంజయ్ దత్, జాకీ ష్రాఫ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తరుణ్ దర్శకత్వంలో కామెడీ ఎంటర్ టైనర్ గా రూపొందింది.

ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ స్పందనను సొంతం చేసుకుంది. ప్రస్తుతం అభిషేక్ 'రాజా శివాజీ'లో నటిస్తున్నారు. రితేశ్ దేశ్ ముఖ్ దీనికి దర్శకత్వం వహిస్తుండగా.. జెనీలియా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ కథగా ఇది రూపొందుతోంది.



# 'ఉస్తాద్ భగత్ సింగ్' సెట్స్‌లో శ్రీలీల బర్త్ డే.. అదిరిన పవన్ లుక్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా ఇప్పుడు చేస్తున్న సినిమాల్లో పాన్ ఇండియా ప్రాజెక్ట్ లు హరిహర వీరమల్లు అలాగే ఓజి చిత్రాలు కంప్లీట్ చేసి రీజనల్ మాస్ ఎంటర్టైనర్ చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ లో రీసెంట్ గానే జాయిన్ అయ్యారు. ఇక ఈ సినిమా షూటింగ్ శరవేగంగా ప్రస్తుతం కొనసాగుతుండగా ఈ గ్యాప్ లోనే హీరోయిన్ శ్రీలీల బర్త్ డే కూడా వచ్చింది.

మరి తన పుట్టినరోజుని చిత్ర యూనిట్ సినిమా షూటింగ్ సెట్స్ లో చేయడం దాని తాలూకా పిక్ ఇపుడు బయటకి వచ్చి వైరల్ గా మారింది. మరి ఇందులో శ్రీలీల సింపుల్ లుక్స్ లో కనిపిస్తుండగా పవన్ కళ్యాణ్ మాత్రం పోలీస్ యూనిఫామ్ గెటప్ లో కనిపిస్తున్నారు. దీనితో ఈ స్పెషల్ మూమెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.



# యంగ్ హీరో తేజ సజ్జా అరుదైన ఘనత

యంగ్ హీరో తేజ సజ్జా తన సినీ ప్రస్థానంలో అరుదైన ఘనతను సాధించారు. బాల నటుడిగా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన తేజ.. చూడాలని వుంది, రాజకుమారుడు, కలిసుందాం రా, ఇంద్ర వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల్లో తన నటనతో గుర్తింపు పొందారు. 2005లో వచ్చిన బోన్సాయ్ చిత్రానికి ఉత్తమ బాల నటుడిగా నంది అవార్డు అందుకుని తన టాలెంట్ ను నిరూపించుకున్నారు. ఇప్పుడు హీరోగా కూడా అదే స్థాయిలో విశేష గుర్తింపు పొందుతున్నారు. హనుమాన్ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో అభిమానాన్ని సంపాదించిన తేజ సజ్జా, మరో ప్రతిష్టాత్మక అవార్డు తన ఖాతాలో వేసుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014 నుండి 2024 మధ్య విడుదలైన



సినిమాలకు గద్దర్ సినీ పురస్కారాలను ప్రదానం చేసింది. అందులో భాగంగా, 2023కి గాను ఉత్తమ ద్వితీయ చిత్రం (బెస్ట్ సెకండ్ ఫిల్మ్) విభాగంలో తేజసజ్జా హనుమాన్ చిత్రం అవార్డును గెలుచుకుంది.

బాల నటుడిగా నంది అవార్డు, హీరోగా గద్దర్ పురస్కారం అందుకొని అరుదైన రికార్డు సాధించిన నటుడిగా నిలిచారు. ప్రస్తుతం తేజ మరో సూపర్ హీరో మూవీ మిరాయ్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ కు అద్భుత స్పందన లభిస్తోంది. హనుమాన్ తరువాత తేజ నుంచి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# కియారా కోసం బెంగళూరు నుంచి ముంబైకి..

కేజీఎఫ్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ తెచ్చుకున్న యశ్ తాజా చిత్రం 'టాక్సిక్'. ఇందులో కియారా అడ్వాణీ కథానాయిక. ఆమె గర్భంతో ఉండటంతో చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సినిమా చిత్రీకరణను బెంగళూరులో చేస్తున్నారు. దీంతో ముంబయి నుంచి బెంగళూరు వెళ్లి రావడం కియారాకు ఇబ్బందిగా మారడంతో ఈ సినిమా చిత్రీకరణను ముంబయికి మార్చినట్లు తెలుస్తోంది. ప్రయాణాల కారణంగా కియారాకు అసౌకర్యం కలగకూడదని యశ్ సూచించడంతో దర్శకనిర్మాతలు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల బడ్జెట్ పెరగకుండా యశ్ పలు సూచనలు కూడా చేసినట్లు తెలుస్తోంది. 90ల్లో గోవాలోని ఓ డ్రగ్ మాఫియా నేపథ్యంలో సాగే కథ ఇది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా తదితర తారలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమాని విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.